జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967

కృష్ణ | సోమవారం 31 ఆగస్టు 2026 | సంపుటి : 01 | సంచిక :228 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష



- ఆ ఒక్క చోట మాత్రం పోస్ట్ పోన్
- రాజస్థాన్‌లో పరీక్షకు విద్యుత్ అంతరాయం
- సుమారు 2.73 లక్షలకు పైగా అభ్యర్థులు హాజరు
- కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహించిన పరీక్ష
- 2 కేంద్రాల్లో నిలిచిన పరీక్ష- అభ్యర్థుల ఆందోళన



భారత్- ఉజ్బెకిస్థాన్

## ట్రేడ్ డీల్

- యురేనియం సరఫరా, యూపీఐ చెల్లింపులకు ఒప్పందాలు
- 5 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యం!
- భారత్– ఉజ్బెకిస్థాన్ మధ్య సంబంధాలు మరింత బలోపేతం
- 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 5 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యం
- భారత్‌కు యురేనియం సరఫరా, ఉజ్బెకిస్తాన్‌లో యూపీఐ చెల్లింపులకు ఒప్పందాలు

## మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర



- రేపు వెలిగొండ పండుగ వద్ద కలుసుకుందాం: సీఎం చంద్రబాబు ట్వీట్
- మార్కాపురంలో కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందన్న సీఎం చంద్రబాబు
- 30 ఏళ్ల వెలిగొండ కలను నిజం చేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- నల్లమల కొండల గుండా నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలు
- తొలి దశలో లక్షలాది మందికి సాగు, తాగునీటి ప్రయోజనం

**అమరావతి**

మార్కాపురం జిల్లా గడ్డపై సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మూడు జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజల భవిష్యత్తుకు తొలి అడుగు పడనుందని, రేపు కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందని ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. కరవు పీడిత ప్రాంత ప్రజలు మూడు దశాబ్దాలుగా కంటున్న వెలిగొండ కల, కృష్ణమ్మ జలాలతో కళ్లముందు నిజం కాబోతోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో 1996లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేసి, ప్రారంభించే అవకాశం రావడం తనను భావోద్వేగానికి గురిచేస్తోందని, మనసుకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వెలిగొండ కేవలం ఒక ప్రాజెక్టు కాదని, కరవుతో పోరాడిన రైతుకు భరోసా అని, ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలకు ఆరోగ్య భద్రత అని, వలస వెళ్లిన యువతకు సొంతగడ్డపై భవిష్యత్తును ఇచ్చే ప్రగతి మార్గమని ఆయన అభివర్ణించారు.

## సహాయక చర్యలు ముమ్మరం

- నేపాల్ ఆకస్మిక వరదలు
- రంగంలోకి దిగిన భారత రెస్క్యూ బృందాలు
- 788కు చేరిన మృతులు.. మొత్తంగా 2,500 మందికి పైగా గల్లంతు
- కొనసాగుతున్న సహాయక చర్యలు





## డ్రగ్స్ రహిత దేశమే లక్ష్యం

- దేశ యువతుల కలలు భూమిని దాటి అంతరిక్షంలోకి దూసుకుపోతున్నాయ్
- పీఎం స్వనిధి లబ్దిదారుల్లో 46 శాతం మంది మహిళలే ఉన్నారు
- దేశ యువతులు కలలు భూమిని దాటి స్పేస్‌లోకి దూసుకెళ్తున్నాయి
- విదేశాల్లోనూ త్రివర్ణపతాకం రెపరెపలాడింది
- మన్ కీ బాత్ ప్రసంగంలో మోదీ వెల్లడి



విశాఖలో అంతర్జాతీయ స్థాయి

## ఆసుపత్రి



- రేపు ఏఐజీకి శంకుస్థాపన చేయనున్న లోకేశ్
- విశాఖలో కొలువుదీరనున్న ఏఐజీ ఆసుపత్రి
- సోమవారం శంకుస్థాపన చేయనున్న మంత్రి నారా లోకేశ్
- రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 9,000 మందికి ఉపాధి
- వెయ్యి పడకలతో ప్రపంచ స్థాయి వైద్య సేవలు

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య రంగం మరో కీలక మైలురాయిని అందుకోబోతోంది. ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఆసుపత్రి ఇప్పుడు విశాఖపట్నంలో తన శాఖను ఏర్పాటు చేయనుంది. ప్రజాప్రభుత్వ పాలనలో అంతర్జాతీయ నగరంగా ఎదుగుతున్న విశాఖలో, ఈ ప్రపంచ స్థాయి వైద్య సంస్థ రాక ఆరోగ్య రంగానికి మరింత బలాన్ని చేకూర్చనుంది. నగరంలోని ఎండాడ ప్రాంతంలో నిర్మించనున్న ఈ ఆసుపత్రికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే, రాష్ట్ర ప్రజలు ఇకపై అత్యున్నత వైద్యం కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం - మిగతా3లో



### రాజ్యాంగ నిర్మాతలు ఆశించింది అదే!

- ప్రముఖ న్యాయకోవిదులను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించకపోవడం విచారకరం
- సుప్రీంకోర్టులో జడ్జీల నియామకాలపై న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ కీలక వ్యాఖ్యలు
- ప్రముఖ న్యాయకోవిదులను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని సూచన

## ఇక క్రాస్ వాల్యుయేషన్!

- 1 నుంచి 10వ తరగతి పరీక్షల మూల్యాంకనంలో కీలక మార్పులు..
- రాష్ట్ర తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షల మూల్యాంకన విధానంలో కీలక మార్పు
- జవాబు పత్రాలను ఇక్కడ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కాకుండా ఇతర స్కూళ్ల టీచర్లతో క్రాస్ వాల్యుయేషన్ చేయించనున్నారు..
- మండల కేంద్రాల్లో ప్రత్యేక వాల్యుయేషన్ సెంటర్లు

**హైదరాబాద్**

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత కచ్చితంగా అంచనా వేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల మూల్యాంకనంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతో పాటు విద్యార్థుల ప్రతిభను నిష్పక్షపాతంగా అంచనా వేయడమే లక్ష్యంగా కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. ఇకపై ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి విద్యార్థుల -1, -2 పరీక్షల జవాబు పత్రాలతో పాటు - మిగతా3లో

### రష్యా ఆయిల్ రిఫైనరీపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి

- పనులు తిరిగి ప్రారంభం అవ్వాల్సి ఉండగానే అటాక్?!
- గతంలో ఇదే కర్మాగారాన్ని కీవ్ తీవ్రంగా దెబ్బతీయడంతో తిరిగి పునరుద్ధరించిన రష్యా
- కీవ్‌పై రష్యా దాడి చేయడంతో పేలుడు పదార్థాలు నిల్వ ఉంచిన గిడ్డంగిలో అగ్నిప్రమాదం
- ఇప్పటివరకు 38మంది మృతి



# సహాయక చర్యలు ముమ్మరం



నేపాల్ ఆకస్మిక వరదల ధాటికి మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. నేపాల్‌లో మృతుల సంఖ్య 788కు చేరిందని నేపాల్ పోలీసులు ఆదివారం తెలిపారు. తాజా గణాంకాల ప్రకారం, చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 264 మంది మరణించారు. ఆ తర్వాత నవల్పరాసి ఈస్ట్‌లో 194, నవల్పరాసి వెస్ట్‌లో 120, గూర్ఖాలో 58, నువాకోట్‌లో 52, ధాడింగ్‌లో 50, తునహున్‌లో 37, రుసువాలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు.
కాగా, నేపాల్ వరదల్లో ఇప్పటి వరకు 2502 మంది గల్లంతు అయ్యారని నేపాల్ పౌరులు ఉన్నారని ఎన్డీఆర్ఆర్ఎంఏ పేర్కొంది. గుర్తుతెలియని మృతదేహాలను గుర్తించే ప్రక్రియ కోసం, వాటిని దేశవ్యాప్తంగా 21 ఆసుపత్రులలో భద్రపరిచినట్లు పేర్కొంది. గల్లంతైన వారిలో 933 మంది హైడ్రోపవర్ (జలవిద్యుత్) ప్రాజెక్టు కార్మికులు కాగా, 592 మంది విదేశీయులు, 127 మంది విదేశీ గ్రూపులతో కలిసి ప్రయాణిస్తున్న ప్రయాణిస్తున్న నేపాల్ పౌరులు ఉన్నారని ఎన్డీఆర్ఆర్ఎంఏ వెల్లడించింది. అలాగే నేపాల్ పోలీస్, నేపాల్ ఆర్మీ, ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్, కస్టమ్స్ ఆఫీస్, ఇమ్మిగ్రేషన్ ఆఫీస్‌కు చెందిన సిబ్బంది కూడా గల్లంతైన వారి జాబితాలో ఉన్నారని పేర్కొంది. ప్రస్తుతం 239 మంది క్షతగాత్రులు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని లేదా డిశ్చార్జ్ అయ్యారని పేర్కొంది. వీరికి సేవలు అందించడానికి విపత్తు ప్రాంతంలో 6 ప్రత్యేక శస్త్రచికిత్స వైద్య బృందాలను మోహరించినట్లు తెలిపింది.

**సహాయక చర్యలు ముమ్మరం**

మరోవైపు 20వేల మంది భద్రతా సిబ్బంది భూమార్గం ద్వారా ఇప్పటివరకు మొత్తం 8,730 మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. వైమానిక సిబ్బంది 363 హెలికాప్టర్ ట్రిప్పుల ద్వారా 236 మంది విదేశీయులతో సహా 3,081 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. వరదల్లో చిక్కుకున్న ఒక హైడ్రోపవర్ టన్నెల్ నుంచి 279 మందిని రక్షించారు. మరోవైపు శిథిలాల కింద ఉన్నవారిని రక్షించేందుకు భారత్, చైనా స్పెషల్ రెస్క్యూ బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. కాగా, గుర్తుపట్టలేనంతగా ఛిద్రమైన మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు, సామూహిక అంత్యక్రియలతో నేపాల్‌లో హృదయవిదారక పరిస్థితులు నెలకొన్నాయి. బాధిత ప్రాంతాల కోసం నేపాల్ ప్రభుత్వం అత్యవసర నగదు సహాయాన్ని విడుదల చేసింది. ఇందులో భాగంగా రసువా, నువాకోట్ జిల్లాలకు చెరో 10 మిలియన్ల నేపాలీ రూపాయలు, ధాడింగ్‌కు రూ.5 మిలియన్లు, 15 స్థానిక ప్రభుత్వాలకు కలిపి రూ.67.5 మిలియన్ల చొప్పున కేటాయించింది.
ఆగస్టు 26న నేపాల్-చైనా సరిహద్దుల్లో విరుచుకుపడిన ఆకస్మిక వరద పెను విషాదాన్ని మిగిల్చింది. మరోవైపు టిబెట్‌లోని క్యిరాంగ్ కౌంటీలో 16 మంది మరణించగా 546మంది జాడ గల్లంతైంది. లాంగ్‌టాంగ్ నేషనల్ పార్క్‌లోని హిమానీనదం విరిగి లోయలో పడడం వల్ల 5.2 తీవ్రతతో సంభవించే భూకంపానికి సమానమైన శక్తి ఉత్పన్నమైందని అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. ఇదే ఆకస్మిక వరదలకు కారణమైందని పేర్కొంది. దాదాపు 100 కిలోమీటర్ల మేర రాళ్లు, బురదతో కూడిన వరద ముంచెత్తిందని పేర్కొంది.

**సొరంగంలో చిక్కుకున్న కార్మికులు**

ఆకస్మిక వరదల ధాటికి రసువాలోని అప్పర్ త్రిశూలీ హైడ్రోపవర్ ప్రాజెక్ట్ టన్నెల్ బురదతో నిండిపోవడంతో, 100 మందికి పైగా కార్మికులు చిక్కుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్, సర్వైవర్ డిటెక్షన్, డీఎన్ఏ పరీక్షల కోసం నేపాల్ చేసిన విజ్ఞప్తి మేరకు భారత్ ప్రత్యేక నిపుణుల బృందాన్ని పంపించింది. అంతేకాదు ఆహారం, మందులు, దుప్పట్లు, రహదారుల పునరుద్ధరణకు ప్రీ-ఫ్యాబ్రికేటెడ్ బ్రిడ్జిలను అందజేసింది. వాతావరణం కాస్త అనుకూలించడంతో నేపాల్ సైన్యం, భారత రెస్క్యూ బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. చైనా కూడా నిపుణులను రెస్క్యూ ఆపరేషన్‌కు పంపింది. శిథిలాల కింద లభ్యమవుతున్న మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా పాడవడంతో, అంటువ్యాధులు ప్రబలకుండా అధికారులు డీఎన్ఏ నమూనాలు సేకరించి, ఆరుబయట సామూహికంగా ఖననం చేస్తున్నారు. కాగా టిబెట్‌లో వరద కారణంగా ఏర్పడిన బారియర్ సరస్సు ముప్పు తగ్గినట్లు చైనా నిపుణులు చెప్పడం పెద్ద ఉపశమనం కలిగించింది. ఆ సరస్సులోని నీటిమట్టం క్రమంగా తగ్గుతోందని స్పష్టమైనప్పటికీ, ఆ నీరు పూర్తిగా దిగువకు చేరేవరకు ప్రమాదం పొంచే ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. దేశాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు దాదాపు 5 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.40 వేల కోట్లు అవసరమవుతాయని నేపాల్ ప్రభుత్వం అంచనా వేసింది.

# రష్యా ఆయిల్ రిఫైనరీపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి

రష్యాలోని పలు ప్రాంతాలపై ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడింది. కిరిషి ప్రాంతంలోని ఒక చమురు శుద్ధి కర్మాగారంపై డ్రోన్ దాడి చేయడంతో భారీ అగ్నిప్రమాదం జరిగింది. గతంలో ఇదే కర్మాగారాన్ని కీవ్ తీవ్రంగా దెబ్బతీయడంతో మాస్కో తిరిగి పునరుద్ధరించింది. మరికొద్ది రోజుల్లోనే కర్మాగారంలో పనులు తిరిగి ప్రారంభం అవ్వాల్సి ఉండగా ఈ దాడి జరగడం గమనార్హం. రోజుకు 4,00,000 బ్యారెళ్ల సామర్థ్యం గల ఈ ప్లాంట్ గ్యాసోలిన్, డీజిల్, ఫ్యూయల్ ఆయిల్‌ను ఉత్పత్తి చేస్తుంది. కిరిషి పెట్రోలియం ఆర్గానిక్ సింథసిస్ కర్మాగారం రష్యాలోని అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారాల్లో ఒకటి. ఇది దేశ వాయువ్య ప్రాంతంలో ఉన్న ఏకైక రిఫైనరీ. అయితే, ఈ దాడిపై అధికారుల నుంచి ఎలాంటి ధ్రువీకరణ రాలేదు. కానీ డ్రోన్ దాడుల తర్వాత కిరిషి పారిశ్రామిక ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగిందని స్థానిక గవర్నర్ అలెగ్జాండర్ డ్రోజ్డెంకో ఆదివారం వెల్లడించారు. ఈ రిఫైనరీ చుట్టుపక్కల ప్రాంతంలో మొత్తం 62 డ్రోన్‌లను కూల్చివేశారని ఆయన చెప్పారు.
ఉక్రెయిన్ ప్రయోగించిన దాదాపు 494 డ్రోన్లను విజయవంతంగా కూల్చేసినట్లు రష్యా ప్రకటించింది. ఈ నెలలో 20కి పైగా రిఫైనరీలపై ఉక్రెయిన్ దాడులు చేసినట్లు వెల్లడించింది. దాడులకు ప్రతిస్పందనగా ఉక్రెయిన్ ఇంధన కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని వార్నింగ్ ఇచ్చింది. ఉక్రెయిన్ ఇంధన మౌలిక సదుపాయాలపై భారీ దాడులు చేయడానికి సిద్ధమవుతున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ఆదివారం వెల్లడించింది. రష్యా పౌర మౌలిక సదుపాయాలు, ఇంధన రంగంపై కీవ్ జరుపుతున్న నిరంతర దాడులకు



ప్రతిస్పందనగా ఈ దాడులను చేపట్టనున్నట్లు రష్యా మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. "రష్యా అమెజాన్"గా పిలిచే రిటైలర్‌పై, అలాగే దేశ చమురు, గ్యాస్ రంగంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు జరిపిన నేపథ్యంలో ఈ దాడులు జరిగాయి.

**ఇంధన ఎగుమతులపై రష్యా నిషేధం**

ఉక్రెయిన్? వరుస దాడులు చేస్తుండడంతో రష్యాలో గ్యాసోలిన్ కొరత ఏర్పడింది. తన ఇంధన మౌలిక సదుపాయాలపై ఉక్రెయిన్ డ్రోన్ దాడుల కారణంగా దేశీయ ఉత్పత్తి 70 శాతం వరకు పడిపోవడంతో గ్యాసోలిన్‌ను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రష్యా తన దేశీయ మార్కెట్లో ఇంధన కొరతను నివారించడానికి పెట్రోల్ ఎగుమతులపై పూర్తి నిషేధాన్ని 2027 జనవరి చివరి వరకు పొడిగించింది. అలాగే డీజిల్ ఎగుమతులపై నిషేధాన్ని 2026 సెప్టెంబర్ 1 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**రష్యా దాడిలో 38 మంది మృతి**

మరోవైపు శనివారం తెల్లవారుజామున కీవ్‌పై రష్యా దాడి చేయడంతో పేలుడు పదార్థాలు నిల్వ ఉంచిన గిడ్డంగిలో అగ్నిప్రమాదం జరిగిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 38మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోవడంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. పేలుడు పరికరాలను గుర్తించి, నిర్వీర్యం చేయడానికి పైరోటెక్నిక్ బృందాలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడిలో కనీసం 50 నివాస భవనాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. మైలాలోని ఒక గిడ్డంగిపై దాడి చేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ గిడ్డంగిలో సుదూర డ్రోన్‌ల కోసం విడిభాగాలు, లాంచ్ బూస్టర్‌లను నిల్వ ఉంచారని చెప్పింది. అలాగే, మైకోలైవ్, ఇజ్మాయిల్ ఓడరేవులపై, కీవ్ ప్రాంతంలో ఉక్రెయిన్ ఫ్లెమింగో క్రూయిజ్ క్షిపణుల విడిభాగాలను నిల్వ ఉంచే ఒక లాజిస్టిక్స్ కేంద్రం, గిడ్డంగి సౌకర్యాలపై కూడా దాడి చేసినట్లు పేర్కొంది. మరోవైపు, ఉక్రెయిన్‌లోని దక్షిణ ఖేర్సన్ ప్రాంతంలో శనివారం రష్యా జరిపిన దాడుల్లో ఇద్దరు మరణించగా, మరో 27 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఈ దాడులతో ఇళ్లు, అపార్ట్‌మెంట్ బ్లాక్‌లు దెబ్బతిన్నాయని, గాయపడిన వారిలో ఒక చిన్నారి కూడా ఉన్నారని చెప్పారు.

# రాజ్యాంగ నిర్మాతలు ఆశించింది అదే!

సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రముఖ న్యాయకోవిదులను నియమించాలనే వాదనను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ఆదివారం బలపరిచారు. ఇలా చేయడం వల్ల ప్రతిభావంతులతో సుప్రీంకోర్టు ధర్మాసనం వైవిధ్యభరితంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. అలాగే ప్రముఖ న్యాయకోవిదులు న్యాయ నిర్ణయ ప్రక్రియలో పాలుపంచుకునేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 (3)(సీ) ప్రకారం ఇటువంటి నియామకానికి వీలున్నప్పటికీ, గత 76 ఏళ్లలో హైకోర్టు న్యాయమూర్తులు లేదా ప్రాక్టీసింగ్ న్యాయవాదులు తప్ప మరెవరూ సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమితులు కాకపోవడం విచారకరమని అన్నారు. దిల్లీలోని నేషనల్ లా యూనివర్శిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల 13వ స్నాతకోత్సవ కార్యక్రమంలో జస్టిస్ భూయాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. "సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా న్యాయకోవిదుడిని (న్యాయశాస్త్ర నిపుణుడు) నియమించడానికి మన రాజ్యాంగంలో అవకాశం ఉన్నప్పటికీ, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 76 ఏళ్లు దాటినా ఇప్పటివరకు అటువంటి నియామకం జరగలేదు. ఒక విశిష్ట న్యాయకోవిదుడు కోర్టుకు గొప్ప విలువను తీసుకురాగలరు. తన పాండిత్యంతో, అత్యున్నత స్థాయిలో నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో గణనీయమైన కృషి చేయగలరు. ప్రముఖ న్యాయకోవిదులు, న్యాయ పండితుల భాగస్వామ్యం సుప్రీంకోర్టు పనితీరుపై కీలక ప్రభావాన్ని చూపుతుంది. అత్యున్నత న్యాయస్థానంలో జడ్జీలుగా న్యాయ శాస్త్ర నిపుణులు ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. అయితే కేంద్ర ప్రభుత్వం లేదా కొలీజియం ఈ అంశాన్ని ఇప్పటివరకు పరిశీలించలేదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎంపిక కావడానికి అవసరమైన లోతైన పరిజ్ఞానం భారతీయ న్యాయకోవిదులకు లేదని వారు భావిస్తున్నారు."

**అదే ఆనవాయితీగా వస్తోంది**

సాధారణంగా హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి లేదా ప్రధాన న్యాయమూర్తిని సుప్రీంకోర్టు జడ్జీగా నియమించడం ఆనవాయితీగా వస్తోందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో బార్ అసోసియేషన్ నుంచి నేరుగా నియామకాలు జరిగాయని, ఆ నియమకాలు అద్భుతమైన ఫలితాలను ఇచ్చాయని గుర్తు చేసుకున్నారు. అయినప్పటికీ న్యాయకోవిదులు ఎవరూ సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమితులు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ న్యాయకోవిదులు సుప్రీంకోర్టులో భాగమై ఉంటే గణనీయమైన కృషి చేయగలిగే అద్భుతమైన మేధావులు న్యాయ రంగంలో ఉండేవారని అభిప్రాయపడ్డారు.
"సుప్రీంకోర్టు అత్యున్నత న్యాయ నిర్ణయాధికార సంస్థ మాత్రమే కాదు. అది దేశానికి నైతిక, చట్టపరమైన, రాజ్యాంగపరమైన అంతరాత్మ సంరక్షకురాలు. సుప్రీంకోర్టు సాంకేతిక అంశాలకు అతీతమైనది. ప్రతిభావంతులైన న్యాయమూర్తులతో ధర్మాసనాన్ని వైవిధ్యభరితంగా మార్చడానికే విశిష్ట న్యాయవేత్త అనే నిబంధనను ఏర్పాటు చేశారు. ఒక వ్యక్తిని విశిష్ట న్యాయవేత్తగా గుర్తించడానికి, అతను కోర్టు ముందు న్యాయవాద వృత్తిని చేపట్టాల్సిన అవసరం లేదు. లాయర్లు, జడ్జీలను న్యాయకోవిదులుగా వర్గీకరించగలిగినప్పటికీ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(3) ప్రకారం ఈ పదాన్ని ఆ రెండు వర్గాలకు మించి విస్తరించాలి. చట్టంలో నైపుణ్యం ఉన్న లేదా చట్ట రంగంలో పరిజ్ఞానం ఉన్న వ్యక్తిని న్యాయకోవిదుడిగా పిలవడానికి అర్హత ఉంటుంది. ఫెడరల్ కోర్టు న్యాయమూర్తిగా నామినేట్ కావడానికి అమెరికా రాజ్యాంగం ప్రకారం కనీసం అధికారిక న్యాయశాస్త్ర డిగ్రీ కూడా అవసరం లేదు. న్యాయ పండితులకు ఆచరణాత్మక అనుభవం కొరవడిందన్న వాదనను అవాస్తవం. అమెరికా, బ్రిటన్, కెనడా, కెన్యా వంటి పలు దేశాల్లో ప్రముఖ న్యాయకోవిదులు రాజ్యాంగ న్యాయస్థానాల జడ్జీలుగా నియమితులవుతున్నారు" అని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ పేర్కొన్నారు.

**యూనివర్సిటీల గురించి కీలక వ్యాఖ్యలు**

ప్రశ్నించే, స్వేచ్ఛగా ఆలోచించే సంస్కృతి విద్యార్థులకు విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లోనే ప్రారంభం కావాలని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అన్నారు. విశ్వవిద్యాలయాలు కేవలం ఒక తరం నుంచి మరొక తరానికి జ్ఞానాన్ని అందించేవిగా మాత్రమే ఉండకూడదని అభిప్రాయపడ్డారు. అవి విద్యార్థులకు స్వతంత్రంగా ఆలోచించడానికి, ప్రశ్నించడానికి సహాయపడాలని తెలిపారు. స్వేచ్ఛను, భిన్నత్వాలను నిజంగా గౌరవించే ప్రజాస్వామ్యాన్ని సమాజం కోరుకుంటే దానికి పునాది విశ్వవిద్యాలయాల్లోనే వేయాలని పేర్కొన్నారు.

## డ్రగ్స్ రహిత దేశమే లక్ష్యం

దేశ యువతుల కలలు భూమిని దాటి అంతరిక్షంలోకి దూసుకుపోతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. మిషన్ శక్తిశాట్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది ఆశావహ బాలికలను భారత్ ఏకం చేస్తుండటం గర్వంగా ఉందన్నారు. ఈ చారిత్రక కార్యక్రమం 108 దేశాలకు చెందిన 12,000 మంది విద్యార్థినులకు ఉపగ్రహ సాంకేతికతలో నైపుణ్యం సాధించడానికి, అంతరిక్ష ఆవిష్కరణలలో కొత్త సరిహద్దులను ఆవిష్కరించడానికి అవకాశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఆదివారం ప్రసారమైన 137వ 'మన్ కీ బాత్' ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "దేశ ఆర్థిక వ్యవస్థలో మహిళల పాత్ర పెరుగుతోంది. పీఎం స్వనిధి స్కీమ్ లక్షలాది మంది మహిళలకు ఊతమిస్తోంది. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు లక్షలాది మహిళలు నగరాలు, పట్టణాల వీధుల్లో తమ పనులతో బిజీగా ఉంటారు. కొందరు కూరగాయలు, కొందరు పండ్లు అమ్ముతారు. కొందరు టీ స్టాల్స్ నిర్వహిస్తారు. మరికొందరు పువ్వులు, దీపాలు, పూజా సామగ్రి అమ్ముతారు. చాలాసార్లు కొద్దిపాటి పెట్టుబడి కొరత వారి వ్యాపారాన్ని ముందుకు సాగకుండా అడ్డుకుంటుంది. కానీ ఇప్పుడు లక్షలాది మంది తల్లులు, సోదరీమణులు పీఎం స్వనిధి పథకం ద్వారా కొత్త బలాన్ని పొందుతున్నారు. చిన్న, వీధి వ్యాపారులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తీసుకొచ్చిన 'పీఎం స్వనిధి' పథకం లబ్ధిదారులలో దాదాపు 46 శాతం మంది మహిళలే ఉన్నారు. అంటే దేశవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు ఈ పథకం ద్వారా తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటున్నారు. అందుకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌కు చెందిన బబితా శర్మ చక్కని ఉదాహరణ. బబిత గతంలో పూజా సామగ్రిని విక్రయించే ఒక చిన్న స్టాల్‌ను ఏర్పాటు చేశారు. పీఎం స్వనిధి పథకం ద్వారా ఆమెకు ఆర్థిక సహాయం లభించింది."

**విదేశాల్లోనూ త్రివర్ణపతాకం రెపరెపలాడింది : మోదీ**

దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న దేశభక్తి స్ఫూర్తిని 'మన్ కీ బాత్'లో మోదీ హైలైట్ చేశారు. హర్‌ఘర్ తిరంగా ప్రచారం విజయవంతమవ్వడంతో ఆగస్టు నెల ప్రత్యేకంగా నిలిచిందని తెలిపారు. "జాతీయ చేనేత దినోత్సవం, క్విట్ ఇండియా ఉద్యమ వార్షికోత్సవం కారణంగా ఆగస్టు నెల చాలా ప్రత్యేకంగా మారింది. స్వాతంత్ర్య దినోత్సవం, జాతీయ అంతరిక్ష దినోత్సవం వంటి సందర్భాలు ప్రతి పౌరుడిలో గర్వాన్ని నింపాయి. హర్ ఘర్ తిరంగా ప్రచారం ఈ దేశభక్తి భావనను మరింత బలపరిచింది. అదే సమయంలో వందేమాతరం 150వ వార్షికోత్సవం ఈ సంవత్సరాన్ని మరింత విశేషమైనదిగా చేసింది. ఫిజీలోని సువాలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఆసియా, ఆఫ్రికా, ఐరోపా ఖండాల్లోని భారత రాయబార కార్యాలయాలు, అమెరికాలో భారత త్రివర్ణ పతాకం రెపరెపలాడింది" అని మోదీ స్పష్టం చేశారు.

**డ్రగ్స్ రహిత భారత్ కోసం కృషి చేయాలని ప్రజలకు పిలుపు**

అలాగే భారత్‌ను డ్రగ్స్ రహితంగా మార్చాలని నరేంద్ర మోదీ దేశ పౌరులకు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం ముప్పు నుంచి దేశాన్ని విముక్తి చేయడానికి, యువతకు మంచి భవిష్యత్తును నిర్మించడానికి కలిసి పనిచేయాలని ప్రజలను కోరారు. మాదకద్రవ్యాల వ్యసనం పర్యావసానాలు కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా మొత్తం కుటుంబం, సమాజంపై పడతాయని చెప్పారు. వికసిత్ భారత్ కోసం నషా ముక్త్ యువ ప్రచారం ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఊపందుకుంటోందన్నారు. దేశ యువత ఆరోగ్యం, సంతోషం, ఉజ్వల భవిష్యత్తు కోసం ఇది ప్రజలందరి సమష్టి సంకల్పమని అన్నారు. "ఈ ఏడాది జరిగిన అమర్‌నాథ్ యాత్రలో పరిశుభ్రత, ప్రజా భాగస్వామ్యానికి సంబంధించిన స్ఫూర్తిదాయకమైన ఉదాహరణలను చూశాం. వేలాది మంది పారిశుధ్య కార్మికులు కఠినమైన మార్గాల్లో రేయింబవళ్లు సేవలు అందించారు. 400 మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలను సేకరించి, వాటిని శుద్ధి చేశారు. యాత్రికులు ఈ శుభ్రతా కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. 16,000 మందికి పైగా పరిశుభ్రత ప్రమాణం చేశారు. పరిశుభ్రత ప్రతి పౌరుడి వ్యక్తిగత నిబద్ధతగా మారినప్పుడు, దాని ప్రభావం పరిసరాలను శుభ్రంగా ఉంచడం వరకే పరిమితం కాదు. అది ఒక ప్రదేశం గుర్తింపు, స్వభావాన్ని పూర్తిగా మార్చివేస్తుంది. అలాగే ముంబయికి చెందిన కృష్ణ శేషాద్రి ఔఔఔ.దీనా=మా=మాజీూ.జూవీ వెబ్‌సైట్‌ను రూపొందించారు. మీరు ఈ వెబ్‌సైట్‌కి వెళ్లి ఏదైనా ఒక సంవత్సరాన్ని ఎంచుకోండి. ఆ సమయంలో భారతదేశంలోని ఏ ప్రాంతాన్ని, ఎవరు పాలించారో ఈ వెబ్‌సైట్‌లో సులభంగా తెలుసుకోవచ్చు. ఇది నాకు చాలా ఆసక్తికరంగా అనిపించింది" అని మోదీ పేర్కొన్నారు.

## భారత్- ఉజ్బెకిస్థాన్ ట్రేడ్ డీల్

మధ్య ఆసియాలో కీలక దేశమైన ఉజ్బెకిస్థాన్‌తో భారత్ తన వ్యూహాత్మక బంధాన్ని మరో స్థాయికి తీసుకెళ్లింది. ప్రధాని నరేంద్ర మోదీ 2 రోజుల ఉజ్బెకిస్థాన్ పర్యటనలో భాగంగా ఆ దేశ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్‌తో ఆదివారం తాష్కెంట్‌లో ఉన్నత స్థాయి ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య సంబంధాల్ని 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం'గా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ఇరువురు నేతలు సంయుక్తంగా ప్రకటించారు. ప్రస్తుతం భారత్- ఉజ్బెకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 1 బిలియన్ డాలర్లుగా ఉండగా, దీనిని 2030 నాటికి ఏకంగా 5 బిలియన్ డాలర్లకు పెంచాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. మైనింగ్, పర్యటకం, సంస్కృతి, విద్య, ఆయుర్వేదం తదితర కీలక రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఇరు దేశాలు 11 అవగాహనా ఒప్పందాలపై సంతకాలు చేశాయి. రక్షణ రంగంలో కూడా సహకారాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించారు. ముఖ్యంగా ఇక్కడ ఉజ్బెకిస్థాన్ నుంచి భారత్‌కు దీర్ఘకాలికంగా (లాంగ్ టర్మ్ సప్లై) యురేనియం సరఫరా చేసేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఇరు దేశాలు అంగీకరించాయి. డిజిటల్ చెల్లింపుల రంగంలో కూడా భారత్‌కు కీలక పురోగతి లభించింది. ఇక్కడ భారత్‌కు చెందిన చీూజ× ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్, ఉజ్బెకిస్థాన్‌కు చెందిన నేషనల్ ఇంటర్‌బ్యాంక్ ప్రాసెసింగ్ సెంటర్ జేఎస్‌సీ మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. దీని ద్వారా భారతీయ యూపీఐ యాప్స్‌ను ఉపయోగించే వారు ఉజ్బెకిస్థాన్‌లోని ఖ్గు= నేషనల్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వ్యాపార చెల్లింపులు చేసే అవకాశం ఏర్పడుతుంది.

**ఉగ్రవాద వ్యతిరేక పోరు**

చర్చల అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ, 'మధ్య ఆసియా ప్రాంతంలో భారత్ భాగస్వామ్యానికి ఉజ్బెకిస్థాన్ గుండెకాయ లాంటిది. ఇరు దేశాల రక్షణ పరిశ్రమలు సంయుక్తంగా మిలిటరీ పరికరాలను అభివృద్ధి చేయడం, ఉత్పత్తి చేయడంపై దృష్టి సారిస్తాయి' అని తెలిపారు. అలానే ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదాలను తీవ్రంగా నిరసిస్తూ ఇవి ఏ ప్రాంతానికైనా తీవ్రమైన సవాళ్లు అని చెప్పిన మోదీ, ఈ ముప్పులపై ఇరు దేశాలు జీరో టాలరెన్స్ విధానాన్ని కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. మధ్య ఆసియాలో శాంతి, పురోగతికి భారత్- ఉజ్బెకిస్థాన్ మధ్య బలమైన భాగస్వామ్యం కీలక శక్తిగా నిలుస్తుందని మోదీ అన్నారు. ఇదే సమయంలో సౌత్ ఉజ్బెకిస్థాన్‌లోని పురాతన బౌద్ధ క్షేత్రాలైన ఫయాజ్ తేపా, కారా తేపాలను పునరుద్ధరించడానికి, పరిరక్షించడానికి రెండు దేశాలు అంగీకరించాయి. వీటితో పాటు అరల్ సీ ప్రాంతంలో అడవుల పెంపకం కోసం భారత్ 1 మిలియన్ డాలర్ల గ్రాంట్‌ను ప్రకటించింది. ఇరు దేశాల మధ్య సహకారానికి మరింత సమన్వయం కల్పించేందుకు విదేశాంగ మంత్రుల స్థాయిలో 'కోఆర్డినేషన్ కౌన్సిల్' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంకా ప్రస్తుతం సెక్రటరీల స్థాయిలో ఉన్న జాయింట్ కమిషన్‌ను మంత్రుల స్థాయికి పెంచనున్నట్లు ప్రకటించారు. ఇరు దేశాల ప్రముఖ పారిశ్రామిక వేత్తలతో త్వరలోనే బిజినెస్ సమిట్ కూడా నిర్వహించనున్నట్లు ఇరు దేశాలు పేర్కొన్నాయి. మరోవైపు ఇంధనం, కీలక ఖనిజాలు, సంస్కృతి, ఔషధాలు, నగల పరిశ్రమ, వ్యవసాయం వంటి రంగాల్లో భారత్‌తో సహకారాన్ని మరింత పెంచేందుకు ఉజ్బెకిస్థాన్ కూడా సిద్ధంగా ఉందని అధ్యక్షుడు మిర్జియోయెవ్ తెలిపారు. ప్రతి రంగానికి కూడా ప్రత్యేక రోడ్ మ్యాప్‌లు రూపొందించి, ఇరు దేశాల నిపుణుల బృందాలు పరస్పరం పర్యటిస్తూ లక్ష్యాల్ని ఖరారు చేస్తాయని చెప్పారు.

**తాష్కెంట్‌లో శాస్త్రి స్మారకానికి మోదీ నివాళి**

ఉజ్బెకిస్థాన్ పర్యటనలో మోదీ ఆదివారం రోజు తాష్కెంట్‌లోని శాస్త్రి స్మారకాన్ని సందర్శించారు. భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడితో కలిసి అక్కడ మొక్క నాటారు. లాల్ బహదూర్ శాస్త్రి 'జై జవాన్, జై కిసాన్' నినాదం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని, ఆయన జీవితం నిరాడంబరతకు, ధైర్యానికి, దేశభక్తికి ప్రతీక అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ సందర్భంగా పేర్కొంది. భారత రెండో ప్రధానిగా పనిచేసిన శాస్త్రి 1966 జనవరి 11న తాష్కెంట్‌లోనే కన్నుమూశారు. 1965 ఇండో- పాక్ యుద్ధానికి ముగింపు పలికేందుకు చారిత్రాత్మక తాష్కెంట్ డిక్లరేషన్‌పై సంతకం చేసిన కొన్ని గంటలకే ఆయన మరణించారు.

# ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష

నీట్ పీజీ 2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. సుమారు 2.73 లక్షలకు పైగా అభ్యర్థులు వైద్య ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) సంస్థ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహించింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష నిర్వహించారు. అయితే, రాజస్థాన్‌లోని జైపూర్‌లో 2 పరీక్ష కేంద్రాల్లో జరగాల్సిన పరీక్షలను వాయిదా వేశారు.

విద్యుత్ అంతరాయంతో పరీక్షలు సజావుగా జరగలేదని, తిరిగి సెప్టెంబర్ 5న పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 3 గంటలకు రీ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నాయి. పరీక్షా కేంద్రం, సవరించిన అడ్మిట్ కార్డులతో సహా తదుపరి వివరాలు విడిగా తెలియజేస్తామని ప్రకటించాయి. రీ షెడ్యూల్ చేసిన పరీక్ష కేంద్రాల్లో దాదాపు 300 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. తమిళనాడు, దిల్లీ, ఉత్తర్ ప్రదేశ్ సహా పలు నగరాల్లోని విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉన్నత వైద్య కోర్సుల్లో ప్రవేశాలు పొందడం కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు. సాంకేతిక సమస్యల కారణంగా పరీక్షకు అంతరాయం కలిగిందని ఆరోపిస్తూ, సీతాపురలోని ఒక పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. “నేను పరీక్ష రాయడానికి ఇక్కడికి వచ్చాను. పరీక్ష మొదలవ్వకముందే సిస్టమ్ పదేపదే ఆగిపోతూ వచ్చింది. రెండు నిమిషాలు పనిచేసి, ఆ తర్వాత ఆగిపోయింది. ఇలా కనీసం 20 సార్లు జరిగింది. కొద్ది సేపటికి పనిచేస్తుందేమోనని అనుకున్నాం. కానీ అది పనిచేయలేదు” అని విష్ణు శర్మ అనే అభ్యర్థి ఆందోళన వ్యక్తం చేశారు. తమ వద్ద భారీ మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నప్పుడు, దేశంలోనే అతిపెద్ద పరీక్షల్లో ఒకటైన దీనికి సరైన సదుపాయాలను కల్పించలేరా? అని అభ్యర్థులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనికి బాధ్యత వహించడానికి ఎవరూ సిద్ధంగా లేరని, పరీక్షను కేవలం తమ కేంద్రంలోనే మళ్లీ నిర్వహించడం



సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిని రద్దు చేసి దేశవ్యాప్తంగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్? చేశారు.

**‘విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాం’**

మరోవైపు, ఈ ఘటనపై పోలీసు అధికారి లలిత్ శర్మ స్పందించారు. “సర్వర్ సరిగ్గా పనిచేయకపోవడం వల్లే పరీక్ష సజావుగా సాగలేదని తెలుస్తోంది. కొందరి కంప్యూటర్లు పనిచేయగా మరికొందరివి పనిచేయకపోవడంతో పరీక్షకు అంతరాయం కలిగింది. పరీక్ష, నిర్వహణ తీరుపై విద్యార్థులు ఆగ్రహంతో ఉన్నారు. ప్రస్తుతం వారితో చర్చిస్తూ, నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఈ విషయం గురించి పరీక్ష నిర్వహణ సంస్థతో ఉన్నతాధికార స్థాయిలో చర్చలు కూడా జరుగుతున్నాయి” అని తెలిపారు.

**నీట్ యూజీ పేపర్‌లీక్ వివాదం**

ఇదిలా ఉండగా, ‘నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ’ (ఎన్‌టీఏ) మే 3న పెన్-అండ్-పేపర్ విధానంలో నిర్వహించిన నీట్ యూజీ 2026, పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో రద్దు చేశారు. అనంతరం, జూన్ 21న రీ టెస్ట్ నిర్వహించారు. అయితే పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, ఫలితంగా కొంత మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఆధ్వర్యంలో దిల్లీ నిరసన ప్రదర్శన చేపట్టారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చింది. ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నూతన విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషిని నియమించారు. పరీక్షలో సంస్కరణలు తీసుకొస్తామని ప్రభుత్వం పేర్కొంది. పేపర్‌లీక్‌లో బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చింది.

# ఇక క్రాస్ వాల్యుయేషన్ !

-మొదటిపేజీ తరువాయి

10వ తరగతి సా-1 పరీక్షల జవాబు పత్రాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయరు. వాటి స్థానంలో ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులతో జవాబు పత్రాలను మూల్యాంకనం చేయించనున్నారు. ఈ విధానాన్ని క్రాస్ వాల్యుయేషన్‌గా పిలుస్తారు. దీనివల్ల విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనంలో పక్షపాతం లేకుండా మరింత పారదర్శకత తీసుకురావచ్చని విద్యాశాఖ భావిస్తోంది.

**మండల కేంద్రాల్లో ప్రత్యేక వాల్యుయేషన్ సెంటర్లు**

క్రాస్ వాల్యుయేషన్‌ను సమర్థంగా నిర్వహించేందుకు ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేక వాల్యుయేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. ఈ కేంద్రాలు మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ లో పనిచేయనున్నాయి. ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఈ కేంద్రాలకు కేటాయించి జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను నిర్వహించనున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను సరిగ్గా గుర్తించేందుకు పరీక్షల ఫలితాలు కీలకం. అయితే అదే పాఠశాల ఉపాధ్యాయులు తమ విద్యార్థుల జవాబు పత్రాలను మూల్యాంకనం చేయడం వల్ల కొన్నిసార్లు మార్కుల విషయంలో తేడాలు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇతర పాఠశాలల ఉపాధ్యాయులతో జవాబు పత్రాలను మూల్యాంకనం చేయించడం ద్వారా విద్యార్థుల అసలైన విద్యా సామర్థ్యాలను మరింత నిష్పక్షపాతంగా అంచనా వేసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.



**పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం**

కొత్త విధానం ద్వారా పరీక్షల మూల్యాంకన ప్రక్రియలో పారదర్శకత పెరగడంతో పాటు ఉపాధ్యాయుల్లో జవాబు దారీతనం కూడా పెరుగుతుందని విద్యాశాఖ పేర్కొంది. అలాగే విద్యార్థుల బలాలు, బలహీనతలను గుర్తించి అవసరమైన చోట అదనపు బోధన, రెమెడియల్ కార్యక్రమాలను చేపట్టేందుకు ఈ మూల్యాంకన ఫలితాలు ఉపయోగపడనున్నాయి. మొత్తంగా తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు పరీక్షల మూల్యాంకనాన్ని మరింత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మార్చే దిశగా ఈ క్రాస్ వాల్యుయేషన్ విధానం కీలక అడుగుగా నిలవనుంది.

## రేకుల షెడ్లకు రూ.కోట్ల ధాన్యం కేటాయింపు - అధికారులు, అక్రమార్కులు చేతులు కలిపి ప్రభుత్వాదాయానికి గండి!

రాష్ట్రంలో రైస్ మిల్లర్ల నుంచి రూ.వేల కోట్ల విలువైన ధాన్యం, సీఎంఆర్ బకాయిల వసూళ్ల వ్యవహారం కీలక మలుపులు తిరుగుతోంది. 5 వారాల నుంచి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సోదాలు నిర్వహిస్తూ దర్యాప్తు ముమ్మరం చేస్తోంది. పౌర సరఫరాల శాఖ ఫిర్యాదులతో ఎగవేతకు పాల్పడిన మిల్లర్లపై పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్టు చేసి జైళ్లకు పంపుతున్నారు. తాజాగా కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ రంగంలోకి దిగింది. నిజామాబాద్ జిల్లాలో మిల్లులకు సంబంధించి విచారణ ప్రారంభించగా, తాజాగా వనపర్తి జిల్లాకు చెందిన 3 రైస్‌మిల్లుల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

**రూ.12 కోట్లు చెల్లించాలని ఫిర్యాదు**

పెద్దపల్లి జిల్లా మంథనిలోని పవనసుత రైస్ మిల్లుకు పౌర సరఫరాల శాఖ అధికారులు 5,798 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించారు. కేటాయించిన ధాన్యాన్ని మరాడించి, బియ్యంగా ఇవ్వలేదని పౌర సరఫరాల శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు 2 రోజుల కిందట పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. ఈ మిల్లుకు 5,789 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగిస్తే, 3,900 మెట్రిక్ టన్నుల బియ్యం రావాలి. కానీ 1,069 మెట్రిక్ టన్నుల బియ్యమే వచ్చింది. బకాయి, జరిమానా కలిపి రూ.12 కోట్లు చెల్లించాలని పౌర సరఫరాల శాఖ అధికారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 10 లారీల ధాన్యం నిల్వ ఉంచే సామర్థ్యం లేని ఈ చిన్న మిల్లుకు అధికారులు వందల లారీల ధాన్యాన్ని ఏ ప్రాతిపదికన కేటాయించారనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. అధికారుల మిలాఖత్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**సీఎంఆర్ బకాయిలపై సర్కార్ నజర్**

మంథని మండలంలోని ఓ రైస్ మిల్లు యజమాని రూ.10 కోట్ల సీఎంఆర్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రభుత్వం ఆ మిల్లును డిఫాల్టర్?గా ప్రకటించింది. దీంతో ఆయన పవనసుత మిల్లును లీజుకు తీసుకుని ఆ మిల్లు పేరిట ధాన్యం కేటాయింపజేసుకుని ఆ ధాన్యాన్ని పాత మిల్లుకు తరలించి బియ్యంగా మార్చారని తెలుస్తోంది. కానీ ఆ బియ్యాన్ని కూడా ప్రభుత్వానికి అప్పగించలేదు. ఈ వ్యవహారంలో బడా రైస్ మిల్లు యజమాని సహా అధికారుల హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని అక్రమాలకు పాల్పడినా ఢిఫాల్డర్ అయిన మిల్లు యజమానిని పక్కన పెట్టి, సహ భాగస్వామిపై మాత్రమే పోలీసులు ఫిర్యాదు చేయడంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. రూ.3,983 కోట్లు చెల్లించాలి : ఇలా పౌర సరఫరాల శాఖ చేపట్టిన విజిలెన్స్ తనిఖీల్లో రైస్ మిల్లర్ల అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. చాలా మంది మిల్లర్ల దగ్గర ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యం లేదు. సీఎంఆర్?గా ఇవాల్సిన బియ్యం ఇవ్వలేదు. తనిఖీలకు వెళుతున్న అధికారులకు డబ్బులు చెల్లిస్తామని, అది కూడా వెంటనే కాకుండా సమయం కావాలని పలువురు మిల్లర్లు కోరుతున్నారు. 2022-23 రబీ సీజన్‌కు సంబంధించి వేలం ధాన్యం డబ్బులు మిల్లర్లు రూ.3,983 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు వసూలైంది దాదాపు రూ.1,000 కోట్లే. మిగతా రూ.2,983 కోట్లు ఎటు వెళ్లాయో అన్నది కీలకంగా మారింది. డబ్బు పెట్టుబడుల రూపంలోకి మారిందా? ఎవరి పేరుతో పెట్టుబడులున్నాయి? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.కోట్ల అక్రమాలపై ఈడీ దర్యాప్తు : 2018 నుంచి అన్ని సీజన్లకు సంబంధించి అత్యధిక బకాయిలు ఉన్న టాప్-20 మిల్లర్ల జాబితాను పౌర సరఫరాలు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు రూపొందించాయి. ఇవే వివరాలు ఈడీకి చేరినట్లు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో మాజీ ప్రజాప్రతినిధికి సంబంధించినవిగా భావిస్తున్న మిల్లుల్లో జరిగిన రూ.కోట్ల అక్రమాలపై ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. వనపర్తి, సూర్యాపేట జిల్లాల్లో ఎక్కువ బకాయిలు ఉన్న మిల్లర్ల వ్యవహారంపైనా ఈడీ దృష్టి పెట్టి వివరాలు సేకరించినట్లు సమాచారం.

**మిల్లర్ల అక్రమ దందాపై రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్**

అత్యధిక బకాయిలున్న టాప్-20 మిల్లర్లలో అత్యధికంగా సూర్యాపేట జిల్లాలో ఆరుగురు ఉన్నారు. నల్గొండలో నలుగురు, వనపర్తి జిల్లాలో ముగ్గురు, ఇతర జిల్లాల్లో మిగతా వాళ్లు ఉన్నారు. ఈ 20 మంది మిల్లర్ల నుంచే రూ.752.12 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. మిల్లర్ల అక్రమ దందాపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించగా, తాజాగా ఈడీ రంగప్రవేశం సంచలనంగా మారుతోంది. మిల్లర్ల అక్రమాల తీవ్రతను పౌర సరఫరాల శాఖ వివరిస్తూ పోలీస్? శాఖ ద్వారా పీడీ యాక్టుతో జైలుకు పంపిస్తోంది. కొందరు మిల్లర్లు రూ.కోట్ల బకాయిలు చెల్లించకుండా జైలుకు వెళ్లడానికి సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి పౌర సరఫరాల శాఖ ఆర్?ఆర్? యాక్టును ప్రయోగిస్తోంది. ఒక్క మహబూబాబాద్ జిల్లాలోనే ఐదుగురు మిల్లర్లకు ఆర్?ఆర్ యాక్టు కింద నోటీసులు జారీ చేసింది. రెండు మిల్లులు కేసముద్రం, మిగతావి కురవి, ఎల్లంపేట, అప్పరాజుపల్లె కేంద్రంగా వ్యాపారం చేస్తున్నాయి. వీరి నుంచి రూ.55 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నాయి. అధికారులు, అక్రమార్కులు చేతులు కలిపి ప్రభుత్వాదాయానికి గండి కొట్టినట్లుగా తెలుస్తోంది. దీనిపై సమగ్ర విచారణ సాగితే అసలు సూత్రధారులు ఎవరో బయటపడే అవకాశం ఉంది.

## విశాఖలో అంతర్జాతీయ స్థాయి ఆసుపత్రి..

-మొదటిపేజీ తరువాయి

గణనీయంగా తగ్గనుంది. విశాఖలో ఏర్పాటు చేస్తున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా సంస్థ రాబోయే ఐదేళ్లలో దశలవారీగా రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి మొత్తం సామర్థ్యం వెయ్యి పడకలకు చేరుకుంటుంది. ఔట్ పేషెంట్ విభాగం (ఓపీడీ) ద్వారా రోజుకు 5,000 మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందించేలా దీనిని తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చిన తర్వాత సుమారు 1000 మంది డాక్టర్లు ఇక్కడ సేవలు అందించనున్నారు.

**ప్రాజెక్టు స్వరూపం, నిర్మాణ ప్రణాళిక**

విశాఖలోని ఎండాడలో మొత్తం 9 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆసుపత్రి క్యాంపస్‌ను, మరో 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను నిర్మించనున్నారు. వైద్య సేవలు, శిక్షణ, పరిశోధనలతో పాటు రోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన అన్ని సదుపాయాలతో కూడిన సమగ్ర హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్‌ను ఒకేచోట ఏర్పాటు చేయడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. మొదటి దశలో టవర్-ఏ, టవర్-బి నిర్మాణాలను 650 పడకల సామర్థ్యంతో చేపట్టి, 2028 అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశలో టవర్-సి నిర్మాణాన్ని 350 పడకల సామర్థ్యంతో మరో రెండేళ్లలో పూర్తి చేస్తారు. హైదరాబాద్‌లోని ఏఐజీ తరహాలోనే ఇక్కడ కూడా 8 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో పాటు 50కి పైగా వైద్య ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ప్రత్యేక మాతా శిశు విభాగం కూడా ఉంటుంది.

**పరిశోధన, శిక్షణకు పెద్దపీట**

వైద్య సేవలతో పాటు విద్య, పరిశోధనలకు ఏఐజీ పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా నర్సింగ్ కళాశాల, సిబ్బందికి హాస్టల్, పారామెడిక్ సిబ్బందికి శిక్షణా కేంద్రం, 500 సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం నిర్మించనున్నారు. క్లినికల్ వ్యవస్థలోనే రీసెర్చ్ ల్యాబ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సెంటర్‌ను ఏర్పాటు చేయనుండటం విశేషం. విజిటింగ్ ఫ్యాకల్టీ, వైద్యుల కోసం వసతితో పాటు రోగుల సహాయకుల కోసం తక్కువ ఖర్చుతో కూడిన వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తారు. వైద్య రంగంలో 30 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ఏఐజీ, ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ట్రోఇంటెస్టినల్ ఎండోస్కోపీ యూనిట్‌గా గుర్తింపు పొందింది. ఈ ఆసుపత్రి రాకతో విశాఖ హెల్త్‌కేర్ హబ్‌గా మారడమే కాకుండా, ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల ప్రజలకు కూడా అత్యున్నత వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

## కవిత హరీష్ ను ఎందుకు టార్గెట్ అయ్యారు...

**హైదరాబాద్** : బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చి తెలంగాణ రక్షణ సేన అనే సరికొత్త వేదికను ఏర్పాటు చేసినప్పటి నుంచి కల్వకుంట్ల కవిత తన ప్రధాన రాజకీయ అస్త్రాన్ని హరీష్ రావు వైపే గురిపెట్టారు. సాధారణంగా ప్రతిపక్షాలు , పొలిటికల్ శత్రువులపై చేసే విమర్శలకు భిన్నంగా.. కేసీఆర్ ఆరోగ్యం క్షీణించడానికి హరీష్ రావే కారణమని, ఆయన క్షుద్రపూజలు చేయిస్తున్నారంటూ ఆమె చేసిన సంచలన ఆరోపణలు రాజకీయ సరిహద్దులను దాటేశాయి. చాలా కాలం కలసి పని చేసిన, పైగా సమీప బంధువు అయిన మాజీ మంత్రిపై కవిత ఇంతటి తీవ్రమైన పొలిటికల్ ఎటాక్‌కు దిగడం వెనుక ఒక సుదీర్ఘ రాజకీయ వ్యూహం దాగి ఉందని భావిస్తున్నారు. కవిత ప్రధాన లక్ష్యం?బీఆర్ఎస్ గులాబీ శ్రేణుల్లోను, కేసీఆర్ కుటుంబంలోనూ హరీష్ రావుపై కోలుకోలేని స్థాయిలో అపనమ్మకాన్ని పెంచడమే. కవిత అరెస్టు కావడం, ఆ తర్వాత పార్టీలో ఆమెకు ప్రాధాన్యత తగ్గడం, చివరికి కేసీఆర్ ఆమెను పక్కన పెట్టేలా జరిగిన పరిణామాల వెనుక హరీష్ రావే సూత్రధారి అనే బలమైన నమ్మకం ఆమెలో ఉంది. అందుకే హరీష్‌ను పార్టీలో ఒంటరిని చేసి, ఆయన బిఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లేలా వాతావరణం సృష్టించాలని అనుకుంటున్నట్లుగా కనిపిస్తోంది. కవిత వ్యూహం కేవలం వ్యక్తిగత కోపం కాదు. బీఆర్ఎస్ క్యాడర్ , కేసీఆర్ ఆత్మీయుల దృష్టిలో హరీష్‌ను విశ్వాసఘాతకుడిగా ముద్ర వేయడం ద్వారా, పార్టీపై హరీష్ పట్టును సడలించాలనేది ఆమె వేసిన పక్కా ప్లాన్ అనుకోవచ్చు. టీఆర్ఎస్‌లో కేసీఆర్ తర్వాత క్షేత్రస్థాయిలో, క్యాడర్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన నేత హరీష్ రావు. ఒకవేళ హరీష్ పార్టీ నుంచి నిష్క్రమిస్తే.. పార్టీపై, గులాబీ కేడర్‌పై కేసీఆర్ కుటుంబం ఆధిపత్యం తిరుగులేనిదిగా మారుతుంది. అయితే ఇప్పుడు కేసీఆర్ కుటుంబానికి కవిత దూరమయ్యారు. కేటీఆర్ దే ఆధిపత్యం అవుతుంది. అయితే కేటీఆర్ వద్ద అసలు నాయకత్వ లక్షణాల్లేవని కవిత అంటున్నారు. హరీష్ రావు గనక బీఆర్ఎస్ నుంచి బయటకు వస్తే, గులాబీ పార్టీ బలహీనపడుతుంది. అప్పుడు బీఆర్ఎస్‌లోని అసంతృప్త నేతలకు, కేడర్‌కు కవిత పార్టీ ఒక ప్రధాన ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉంటుంది. కేసీఆర్ కు ఇప్పటికీ అత్యంత ఆప్తుడిగా, నమ్మకస్తుడిగా హరీష్ ఉండటాన్ని కవిత తట్టుకోలేకపోతున్నారు. హరీష్‌ను పార్టీకి దూరం చేయగలిగితే, మళ్లీ కేసీఆర్ మనసు గెలుచుకుని, అవసరమైతే భవిష్యత్తులో బీఆర్ఎస్‌ను తన వేదికతో విలీనం చేసి రీ-ఎంట్రీ ఇవ్వవచ్చనే ఆలోచన కూడా ఆమెలో ఉండి ఉండవచ్చునని భావిస్తున్నారు. అయితే కవిత వేస్తున్న ఈ పావులు ఎంతవరకు పారుతాయనేది సందేహాస్పదమే. హరీష్ రావు దశాబ్దాలుగా గ్రౌండ్ లెవెల్ రాజకీయాలు చేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో నిర్మించిన నాయకుడు. కవిత చేసే క్షుద్రపూజల ఆరోపణలను సామాన్య ప్రజలు లేదా తీవ్రస్థాయి గులాబీ కేడర్ ఎంతవరకు నమ్ముతారనేది ప్రశ్నార్థకం. పైగా కేటీఆర్ కూడా ప్రస్తుతానికి హరీష్‌తో కలిసే ప్రతిపక్ష పోరాటం చేస్తున్నారు. ఒకవేళ కవిత అనుకున్నట్లుగా హరీష్ రావుపై ఈ ఆరోపణలు పనిచేసి, ఆయన బీఆర్ఎస్‌కు దూరమైతే అది కవిత తెలంగాణ రక్షణ సేన కు రాజకీయంగా ఊపిరి పోస్తుందనడంలో సందేహం లేదు. కానీ, ఇది ఉమ్మడి మెదక్, వరంగల్ వంటి ప్రాంతాల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంకును భారీగా దెబ్బతీసి, కాంగ్రెస్ లేదా బీజేపీలకు మేలు చేసే ప్రమాదం కూడా ఉంది. ఏది ఏమైనా కవిత-హరీష్ మధ్య జరుగుతున్న ఈ సమరం తెలంగాణ రాజకీయాల్లో రాబోయే రోజుల్లో మరిన్ని ఊహించని మలుపులకు దారితీయనుంది.

## వారసులొస్తున్నారు.....

**విజయవాడ** : ఏపీలో స్థానిక సమరానికి రంగం సిద్ధమవుతున్న వేళ రాజకీయ పార్టీల్లో కొత్త సమీకరణాలు మొదలైనట్లు కనిపిస్తోంది. అక్టోబరులో కొత్త ఓటర్ల జాబితా విడుదల కానున్న నేపథ్యంలో అంతకంటే ముందే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, మండల, జిల్లా పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే దిశగా ఏర్పాట్లు సాగుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలైందిఈసారి స్థానిక ఎన్నికలను అధికార కూటమితో పాటు వైసీపీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ జరుగుతోంది. అయితే ఈసారి మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వస్తోంది. సీనియర్ నేతలు తమ స్థానంలో కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావడానికి స్థానిక ఎన్నికలను అనుకూల వేదికగా చూస్తున్నట్లు తెలుస్తోంది.ముఖ్యంగా మేయర్, మున్సిపల్ చైర్మన్, జడ్పీ చైర్మన్ వంటి కీలక పదవులకు తమ కుమారులు, కుమార్తెలను పోటీ చేయించాలనే ఆలోచనలో పలువురు నేతలు ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం కష్టమైన పరిస్థితుల్లో స్థానిక ఎన్నికలు వారసులకు రాజకీయ అరంగేట్రం చేయించే అవకాశాన్ని కల్పిస్తున్నాయని నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. పైగా ఎన్నికల్లో ఆర్థికంగా, రాజకీయంగా పూర్తి స్థాయిలో సహకరించగల వ్యక్తిని బరిలోకి దించాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యుల వైపు మొగ్గు చూపుతున్నారని ప్రచారం జరుగుతోంది.

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ పలువురు సీనియర్ నాయకులు తమ వారసులకు టికెట్లు ఇప్పించేందుకు ప్రయత్నించారు. టీడీపీ , వైసీపీ రెండింటిలోనూ ఇలాంటి ఆశలు ఉన్నప్పటికీ, ఎన్నికల సమీకరణాలు, గెలుపు అవకాశాలను దృష్టిలో పెట్టుకునిఅన్ని చోట్లా వారసులకు అవకాశం ఇవ్వలేదు. అయినప్పటికీ యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్య, టీజీ వెంకటేశ్ కుమారుడు భరత్, పేర్ని నాని కుమారుడు కిట్టూ, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ వంటి వారికి రాజకీయ అవకాశం లభించింది.అదే సమయంలో పలువురు సీనియర్ నేతల వారసులకు మాత్రం గత ఎన్నికల్లో టికెట్లు దక్కలేదు. దీంతో ఇప్పుడు స్థానిక ఎన్నికలపై వారు ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, జడ్పీ చైర్మన్ వంటి పదవులు రాజకీయంగా మంచి గుర్తింపు ఇవ్వడంతో పాటు భవిష్యత్తులో పెద్ద పదవులకు వెళ్లేందుకు బలమైన పునాది అవుతాయని భావిస్తున్నారు.

# హంద్రీనీవా కాలువ గట్లపై రైతుల పంపుసెట్లకు కష్టాలు.. బలవంతంగా తొలగిస్తున్న అధికారులు

**శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి పుణ్యక్షేత్ర విరాళాల దుర్వినియోగానికి తావులేకుండా పారదర్శక లెక్కల నిర్వహణ.**

**బీటీ పకీరప్ప భవనంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ దేవర గుడి జగదీష్**




**గుంతకల్లు ఆగస్టు 30 (ప్రజా జ్యోతి):** ఆదివారం గుంతకల్లు సిపిఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ డి.జగదీష్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో డి.జగదీష్ మాట్లాడుతూ హంద్రీనీవా కాలువగట్లకు పంపుసెట్లు మోటార్లను అధికారులు బలవంతంగా తొలగిస్తున్నారు. దానివలన పంటలు ఎండిపోతున్నాయి అసలే వర్షాలు లేవు హంద్రీనీవా కాలువలో పంట పొలాలకు 3.5 లక్షల ఎకరాలకు ఆయ కట్టుకు నీరు ఇవ్వాలి. డిస్ట్రిబ్యూటర్లకు నీళ్లు ఇవ్వడం లేదు ప్రభుత్వ అధికారులు మోటార్లు తొలగిస్తున్నారు ఇది పూర్తిగా అన్యాయం పంటలు కాపాడుకోవడానికి నీరు అవసరము కనుక భూగర్భ జలాలు పెరిగి బోర్లు రీఛార్జ్ అవుతాయి కనుక ప్రభుత్వం వాటికి అనుమతి ఇవ్వాలని.సిపిఐ పార్టీగా మేము డిమాండ్ చేస్తున్నాము మరోవైపు కేసులు పెడతామని రైతులను బెదిరిస్తున్నారు. రైతులందరికీ సిపిఐ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుంది. అదేవిధంగా అనంతపురం జిల్లా గుంతకల్లు మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రం కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో అభివృద్ధి పనులు చేయాలనే ఉద్దేశంతో దాతలు విరాళాలు పుష్కలంగా ఇస్తున్నారు. ఆ నిధులను పారదర్శకంగా జవాబుదారితనంతో ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉంది.కొత్త ఈవో వచ్చిన తర్వాత విరాళాలు సేకరణ బాగా చేస్తున్నారని అభినందించాము కానీ ఇప్పుడు డెవలప్మెంట్ మెటీరియలలో నాణ్యత లేదు.కమిటీ జవా బుదారుతనంతో పనిచేయా భక్తులు పుణ్యక్షేత్రంలో ఇచ్చే నిధులను సద్వినియోగంగా ఉపయోగించాలని కోరుచున్నాము. కసాపురం దేవస్థానంలో అభివృద్ధి పనులలో అనుభవజ్ఞులను కలుపుకోవాలని ప్రతి ఒక్క రూపాయికి లెక్కచారలు ఉండాలి.ప్రతిరోజు కొనుగోలు చేసిన మెటీరియల్ లను డిస్ప్లే బోర్డులో ప్రదర్శించాలి. అదేవిధంగా అయోధ్య ట్రస్ట్ బోర్డు సభ్యులను దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు నియమించిన ట్రస్ట్ బోర్డు సభ్యులు నిధులు దుర్వినియోగం చేశారు. భక్తాదులు సమర్పించినటు వంటి బంగారు ఇటుకలను, వెండి ఇటుకలను ఆభరణా లను 2000 కోట్లు డబ్బులు కూడా చోరీ జరిగిందని అక్కడ ఉన్నటువంటి పోలీసు అధికారులు కూడా ధ్రువీకరించారు. వారందరి మీద కేసులు పెట్టి అరెస్టు చేయడం జరిగింది కనుక దేవాలయాలలో నిధులు దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అని జగదీష్ తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి గోవింద్, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి పి.రాము రాయల్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## సిపిఎం పోరాట ఫలితంగానే మాన్యువల్ విద్యుత్ బిల్లులు కౌంటర్లు పునఃప్రారంభం



**గుంతకల్లు ఆగస్టు 30 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన మాన్యువల్ గా విద్యుత్ బిల్లులు కట్టించుకు నే బిల్లు కౌంటర్లు కేంద్రాలు తిరిగి ప్రారంభించాలని ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. సిపిఎం పార్టీ పోరాట ఫలితంగా నే ఆదివారం గుంతకల్లు విద్యుత్ ఏ డి ఈ నాగేంద్ర కుమార్ గతంలో మాన్యువల్ గా ఉన్న మూడు విద్యుత్ బిల్లు కౌంటర్లను పునఃప్రారంభిం చడం చాలా హర్షదాయకం విద్యుత్ శాఖ వారికి సిపిఎం పార్టీ తరఫున ధన్యవాద ములు తెలుపుతూ కేవలం నెల ఆఖరిలో రెండు మూడు రోజులు మాత్రమే ఈ బిల్లు కౌంటర్లను తెరవడం కాకుండా నిరక్షరా స్యులు, వయోవృద్ధులు వినియోగదారులను దృష్టిలో ఉంచుకొని ప్రతిరోజు ఈ మాన్యువల్ విద్యుత్ బిల్లు కౌంటర్లను తెరిచి ఉంచాలని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్ ఏడిఈని కోరడం జరిగింది.

## కృష్ణబాబు ఆదర్శప్రాయుడు ఆయన ఆశయాలే మనకు స్ఫూర్తి - నామా కొండబాబు




**కొవ్వూరు, ఆగస్టు 30,ప్రజాజ్యోతి న్యూస్** కొవ్వూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు ప్రజల మనిషిగా పేరుగాంచిన పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు)విగ్రహావిష్కరణ కార్యక్రమం కొవ్వూరు ఫోర్త్ బ్రిడ్జ్ కూడలిలో ఆదివారం ప్రముఖుల సమక్షంలో అత్యంత ఘనంగా జరిగింది.కృష్ణబాబు అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలు ప్రాంతాల నుండి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కృష్ణబాబు అభిమానులు వేలాదిగా తరలివచ్చి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి తాడిపూడి గ్రామం నుండి సొసైటీ అధ్యక్షులు నామా కొండబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, యువత, అభిమానులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా నామా కొండబాబు మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి కృష్ణబాబు ఎనలేని కృషి చేశారని ఆయన హయాంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్లిందని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించే వ్యక్తిత్వం ఆయన సొంతమని కొనియాడారు.తన తండ్రి నామా శ్రీరాములుకు కృష్ణబాబుకు మధ్య ఎంతో సన్నిహిత అనుబంధం ఉండేదని వారిద్దరూ కలిసి తాడిపూడి గ్రామ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఈనాటి తరం నాయకులు కృష్ణబాబును ఆదర్శవంతంగా తీసుకుని ఆయన ఆశయాలను నెరవేర్చడమే మనందరి బాధ్యత అని అన్నారు

## నేతగుట్లపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ బాధిత రైతులకు న్యాయం చేయాలి

**ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అన్నమయ్య జిల్లా**

**ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి**



**రాయచోటి ఆగస్టు 30 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గం, పుంగనూరు మండలంలోని నేతగుట్లపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రంగారెడ్డి రైతులతో కలిసి ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు ప్రాజెక్టు నిర్మాణం వల్ల తమకు జరిగిన ఇబ్బందులను, అన్యాయాన్ని రంగారెడ్డితో వివరించారు. 2021--22 సంవత్సరంలో రిజర్వాయర్ ప్రాజెక్టు పనులు ప్రారంభించిన సమయంలో ప్రాజెక్టు కిందవున్న వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్ప టికి, నష్టపరిహారం విషయంలో రైతులకు ఇచ్చిన హామీలు ఇప్పటికి అమలు కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రాజెక్టుకోసం భూములు కోల్పోయిన రైతులకు అప్పట్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఎకరాకు రూ.14 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారని వారు రంగారెడ్డికి తెలిపారు. అయితే దాదాపు నాలుగు సంవత్సరాలు గడిచినా నష్టపరిహారం అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని రైతులు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో బాధిత రైతులతో కలిసి మదనపల్లె కలెక్టరేట్‌కు చేరుకున్న రంగారెడ్డి సంబంధిత అధికారులను కలిసి రైతుల సమస్యలను వివరించారు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం అందించడంతోపాటు వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని సబ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.భూములు కోల్పోయిన రైతులు ప్రస్తుతం సాగు చేసుకునేందుకు భూమిలేక, ఉపాధి అవకాశాలులేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రంగారెడ్డి సబ్ కలెక్టర్ కు తెలిపారు. అప్పులుచేసి జీవనం సాగిస్తున్న రైతుల సమస్యలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. అనంతరం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ రైతులకు న్యాయం జరగకపోతే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులపక్షాన పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని, న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, లేనిపక్షంలో రైతులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతులు మోహన్ నాయుడు, గూడెం మాజి సర్పంచ్ శ్రీనివాసులు, కిష్టప్ప, బాలకృష్ణ, వెంకట్ రెడ్డి, రైతులు హాజరు కావడం జరిగింది.

## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఉపాధ్యక్షులు చూడి ఉలిగయ్య మరియు కుమారులు సతీష్ నాయుడు మండల అధ్యక్షులు చూడి సురేష్ నాయుడు



**కౌతాళం,ఆగష్టు 30** ఆదివారం రోజున మంత్రాలయం నియోజకవర్గం నందు కౌతాళం మండలం మెలిగనూరు గ్రామం కోసిగి మండలం కామన్ దొడ్డి గ్రామం పెద్దకడుబురు మండలం బాసలదొడ్డి మరియు ఆదోని మండలం సంతెకుడ్లూరు గ్రామం మరియు పలు గ్రామాలలో తెదేపా కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రుల వివాహ వేడుకల మేరకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా నిన్నటి రోజున గుమ్మనూరు జయరాం కుమార్తె అనంతపురం జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు కుమారులు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతుల వైవాహిక జీవితం సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది.ఈ కార్యక్రమములో గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగినది.

## కౌతాళం మండల కేంద్రంలో వైఎస్ఆర్సిపి కార్యకర్త కాంతప్ప గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న వైఎస్ఆర్సిపి యువనేత దాట్ల సుబ్బరాజు



**కౌతాళం,ఆగష్టు 30 ప్రజా జ్యోతి** మండల కేంద్రమైన కౌతాళంలో ఆదివారం రోజున గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ యువ నాయకులు దాట్ల సుబ్బరాజు ఈ వేడుకల్లో పాల్గొన్న సుబ్బరాజును కాంతప్ప వారి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు కాంతప్ప వారి కుటుంబ సభ్యులు ఎల్లప్పుడు సుఖ సంతోషాలతో ఉండాలని వారిని ఆశీర్వదించారు. కాంతపు వారి కుటుంబ సభ్యులు సుబ్బరాజుని వీరేశప్ప స్వామిని పూలమాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు గణపతి రాజు,కుమార్ రాజు, డాక్టర్ అప్పులు, ఎంపిటిసి రాజ్యహమ్మద్,ఆనంద్, సత్య గౌడ్,ఉపేంద్ర గౌడ్,రాము,డ్రైవర్ లింగన్న,మూలేమాన్ నరసింహులు,ఎన్టీఆర్ నగర్ వీరేష్, సాయిబాబా,మోదిన్ సాబ్ దాట్ల యూత్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన రామవరం జట్టుకు పోలవరం ఎమ్మెల్యే అభినందనలు



**జీలుగుమిల్లి :30 ఆగస్ట్ జీలుగుమిల్లి : ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్ )** వేలేరుపాడు మండలం రామవరం పంచాయతీ మల్లారం గ్రామానికి చెందిన యువత ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడ లో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో ప్రథమ స్థానం సాధించి,జాతీయ స్థాయి పోటీలకు కోయంబత్తూరులో సెప్టెంబర్ 6 న జరగబోయే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడం జరిగింది, వీరిని వేలేరుపాడు జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేచినేని, సంజయ్ ఆధ్వర్యంలో మల్లారం వాలీబాల్ క్రీడాకారులు ఎమ్మెల్యే చిర్రి బాలరాజుని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది, ఎమ్మెల్యే బాలరాజు ముందుగా క్రీడాకారులను అభినందించారు,ఎమ్మెల్యే మాట్లాడుతూ మన నియోజకవర్గానికి, మన జిల్లాకు మరీ ముఖ్యంగా మన రాష్ట్రానికి క్రీడలలో గెలిచి మంచి పేరు తేవాలని అన్నారు, మీ వెనుక నేను ఉన్నాను అని ధైర్యం చెప్పి క్రీడాకారులకు చిర్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రోత్సహకంగా 20,000/ రూపాయల నగదు, రెండు వాలీబాల్ కిట్లను, బ్యాంకర్ల ను అందచేశారు, మరెన్నో విజయాలను అందుకుని, ముందుకు సాగాలని ఆకాంక్షిచారు, క్రీడాకారులు మాట్లాడుతూ ఎమ్మెల్యే గారు మంచిగా ఆదరించారని క్రీడాకారులు అంటే వారికి ఎంతో మక్కువ అని ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో క్రీడాకారులు అభిరామ్, మనోజ్, ధర్మ,ఉదయ్, వెంకన్న బాబు,పవన్, అరవింద్, మరియు జనసేన నాయకులు బి శివరామ్, చంటి, భాను, నాగు, ప్రవీణ్, శ్రీనివాస్, అన్వేష్, కిరణ్, వంశీ, సాయి, బాబు తదితరులు పాల్గొన్నారు.

## కడప మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైయస్సార్ సిపి మండల నేత పెడబల్లె గణేష్ రెడ్డి మృతికి రెడ్యం సంతాపం

**మంచి మనిషి, .గణేష్ రెడ్డి మృతికి అత్యంత బాధాకరం:రెడ్యం**



చెన్నూరు రెడ్డివారి వీధికి చెందిన పెడబల్లె గణేష్ రెడ్డి (66) అనారోగ్యంతో హైదరాబాదులోని వారి కుమార్తె స్వగృహంలో ఆదివారం తెల్లవారుజామున మరణించారు. గణేష్ రెడ్డి. మృతదేహాన్ని వారి స్వగృహం చెన్నూరుకు తెచ్చారు. వైయస్సార్సిపి రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆదివారం మధ్యాహ్నం గణేష్ రెడ్డి స్వగృహంలో ఆయన మృతదేహంపై పూలమాలవేసి ఘన నివాళి అర్పించి, ప్రగాడ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తపరిచారు.పెడబల్లి గణేష్ రెడ్డి తమ్ముడు డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్ పెడబల్లె ప్రతాప్ రెడ్డి, కుమారుడు పెడబల్లి ప్రదీప్ రెడ్డిని పరామర్శించి, ఓదార్చి ధైర్యం చెప్పారు. మంచి మనిషి, నిజాయితీ, నిబద్ధత కలిగిన గణేష్ రెడ్డి నాకు చిరకాల మిత్రుడని ఆయన మృతి అత్యంత బాధాకరమని... మృతుని తాను జీర్ణించుకోలేక పోతున్నానని రెడ్యం ఆవేదన వ్యక్తపరిచారు.

## శంఖవరంలో వైభవంగా విజయదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

**అమ్మవారి మహోత్సవాలకు పోటెత్తిన భక్తజనం**



**శంఖవరం, ఆగస్టు 30, (ప్రజాజ్యోతి న్యూస్)** శంఖవరం కృష్ణాలయం వీధిలో నూతనంగా నిర్మించిన శ్రీ గంగాలమ్మతల్లి, శ్రీశ్రీశ్రీ విజయదుర్గమ్మ భవాని అమ్మవారి మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం 10.55 గంటలకు ఉత్తరాభాద్ర నక్షత్రంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట కార్యక్రమాలు కాజులూరు మండలం దుగ్గుదురు గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ పూజ్యం నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమానికి గుడి ధర్మకర్త కారుకొండ శ్రీను, గంగాభవాని దంపతుల ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పర్వత సురేష్, పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు ముఖ్యఅతిథులను ఘనంగా సత్కరించారు. పెద్ద సంఖ్యలో వచ్చేవేటి నువ్వు నువ్వు వచ్చావా భక్తులకి 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు,ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం చైర్మన్ నల్లం సూర్య చక్రధరరావు, వెన్న శివ, బద్ది రామారావు, యాళ్ల జగదీష్, ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, రౌతులపూడి ఎంపీపీ గంటిమళ్ల రాజలక్ష్మి, జనసేన నాయకులు మేడిశెట్టి సూర్య కిరణ్ (బాబి), తలపంటి బుజ్జి, వీర్ల సూరిబాబు, అన్నవరం ట్రస్ట్ బోర్డు మెంబర్ కామర్స్ చిరంజీవి, బుర్ర వాసు, బొమ్మిడి సత్యనారాయణ, ఈగల దేవుళ్ళు, కొల్లుబోయిన సురేష్, బొట్టా గోపి, మురుకుర్తిలోవ సత్తిబాబు, ఇసరపు వరప్రసాద్, కొల్లుబోయిన దేవి భగవాన్, రాజు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కౌతాళం మండలంలో పలు వివాహ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి మరియు కౌతాళం మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద ఆచారి



**కౌతాళం,ఆగష్టు 30 ప్రజా జ్యోతి** ఆదివారం రోజున కౌతాళం మండలం నందు కౌతాళం వాస్తవ్యులైన ఎన్టీఆర్ నగర్ కిష్టప్పా కుమార్తె, మరియు ఉప్పర్ మల్లి,వడ్డే చిన్న హుసేని కుమారుడు లింగలదిన్నె గోపాల్ నూతన దంపతులను సుఖశాంతులతో,ఆయురారోగ్యాలతో సాగాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది.మరియు వారిని పూలమాలతో శాలువతో సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి కౌతాళం మాజీ సర్పంచ్ పాల్ దినకర్,ఉప సర్పంచ్ సక్రి తిక్కయ్య,వడ్డే రాము, అవతారం, సుగురప్పా,వడ్డే చిన్న ఉసేని, ఆదినారాయణ రెడ్డి, రామకృష్ణ, సక్రి.శ్రీరామ్, బెస్తా మర్రిస్వామి వడ్డే ఆంజి,ఎన్టీఆర్ నగర్ భాషా,ఎంపీటీసీ మూఖన్న మరియు సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాదర్ లింగ మరియు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగినది.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న వైఎస్ఆర్సిపి యువ నాయకులు దాట్ల సుబ్బరాజు



**కౌతాళం, ఆగష్టు 30 ప్రజా జ్యోతి** కౌతాళం మండలంలోని బుదుమల దొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం నందు కౌతాళంలోని ఎన్టీఆర్ నగర్ చెందిన కీర్తిశేషులు వడ్డే నరసప్ప కుమారుని వివాహ వేడుకలకు వైఎస్ఆర్సిపి యువ నాయకులు సుబ్బరాజు పాల్గొన్నారు నూతన వధూవరులను ఆశీర్వదించి జీవితం కాలం పాటు అన్యోన్యంగా జీవించాలని ధైర్యంగా ఉండాలని వారిని కోరారు.ఈ వేడుకల్లో పాల్గొన్నందుకు కుటుంబ సభ్యులు వైఎస్ ఆర్సిపి యువ నాయకులు డాక్టర్ సుబ్బరాజుని సన్మానించి సత్కరించారు.ఈ వేడుకలో వైఎస్సార్సీపీ నాయకులు గణపతి రాజు,కుమార్ రాజు,డాక్టర్ అప్పలు, ఎంపిటిసి రాజ్యహమ్మద్, ఆనంద్,సత్య గౌడ్,ఉపేంద్ర గౌడ్,రాము,డ్రైవర్ లింగన్న,మూలేమాన్ నరసింహులు,ఎన్టీఆర్ నగర్ వీరేష్, సాయిబాబా,మోదిన్ సాబ్,దాట్ల యూత్ తదితరులు పాల్గొన్నారు.

## నవ దంపతులను ఆశీర్వదించిన ఉరుకుంద మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ చెన్న బసప్ప



**కౌతాళం,ఆగష్టు 30 ప్రజా జ్యోతి** మండల కేంద్రమైన కౌతాళంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త పుగ్గి ఈరన్న కుమారుని వివాహ వేడుక ఘనంగా జరిగింది.ఈ వేడుకకు ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్న బసప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చెన్న బసప్పకి కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికి శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం నూతన వధూవరులను ఆశీర్వదించి,వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా కౌతాళంకు చెందిన ఉప్పర మల్లికార్జున వివాహ వేడుక ఉరుకుంద గ్రామంలో జరగగా,ఆ వేడుకకు కూడా చెన్న బసప్ప హాజరై నవ దంపతులను ఆశీర్వదించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మంజునాథ, రాజబాబు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## హిందూ ధర్మ రక్షణకు యువత కంకణబద్ధులై ఉండాలి.

**రాష్ట్ర అర్చక వేద మందిర విభాగ ప్రముఖ్ శివ శంకర్.**



**పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. ఆగష్టు 30.** హిందూ ధర్మ రక్షణకు యువత కంకణబద్ధులై ఉండాలని ప్రతీ యువకుడిలోనూ దేశభక్తి, దైవభక్తి మరింత పెరగాలని ఆంధ్రప్రదేశ్ అర్చక వేద మందిర విభాగ ప్రముఖ్ శ్రీ శివశంకర్ ఆకాంక్షించారు. పోడూరులోని శ్రీ మూలేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ విభాగాల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యువకులంతా వ్యసనాలు, వ్యామోహాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, శారీరక దారుఢ్యం పెంచుకొని మంచి అలవాట్లు పెంపొందించుకుని జీవించాలని అన్నారు. భావితరాలకు సంపూర్ణ ఆరోగ్యవంతమైన సంతానం అందించాలని అయన సూచించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ మండల ప్రముఖ్ గా ఉనికిల గాంధీ బజరంగ్ దళ్ ప్రముఖ్ గా గెద్దాడ హరీష్, ఉపాధ్యక్షులుగా గెద్దాడ మోహన్ లను నియమించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు శీలబోయిన జయ రామకృష్ణ, తోలేటి వేణు, చెల్లబోయిన సత్యనారాయణ, కోలా విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేరళిట్స్ స్కూల్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఘనంగా ఓనం వేడుకలు వేడుకకు వేదికగా నిలిచిన మంటిస్సోరి హై స్కూల్



**తాళ్లపూడి, ఆగస్టు 30,ప్రజాజ్యోతి న్యూస్** కేరళిట్స్ స్కూల్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో తాళ్లపూడి మాంటిస్సోరి హైస్కూల్లో ఓనంవేడుకలను ఘనంగా,సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మాంటిస్సోరి హైస్కూల్ కరస్పాండెంట్ అనీష్ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులు కేరళ సంప్రదాయ దుస్తులు ధరించి, పాఠశాల ప్రాంగణంలో ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఓనం పండుగ చరిత్ర, విశిష్టత, సాంస్కృతిక ప్రాధాన్యత గురించి కొవ్వూరు హోలీ హై స్కూల్ కరస్పాండెంట్ నెల్సన్ ఆంటోనీ వివరించారు. కేరళలో అత్యంత ముఖ్యమైన పండుగగా ఓనం ప్రసిద్ధి చెందిందని, సాధారణంగా చింగం మాసంలో పది రోజుల పాటు వివిధ సంప్రదాయ కార్యక్రమాలతోజరుపుకుంటారని తెలిపారు. పంటలు సమృద్ధిగా పండిన సందర్భంగా రైతులు, ప్రజలు ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే పండుగగా కూడా ఓనంకు ప్రత్యేక స్థానంఉందని వివరించారు.పురాణ కథనం ప్రకారం ప్రజలను ఎంతో ప్రేమగా, సమానత్వంతో పాలించిన మహాబలి చక్రవర్తి జ్ఞాపకార్థం ఓనం జరుపుకుంటారని తెలిపారు. మహాబలి పాలనలో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా జీవించారని విశ్వసిస్తారని చెప్పారు. ప్రతి సంవత్సరం మహాబలి తన ప్రజలను పలకరించేందుకు వస్తాడనే నమ్మకంతో ఓనంవేడుకలను ఎంతో ఆనందంగా నిర్వహిస్తారని వివరించారు.ఓనం వేడుకల్లో పూకళంకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, వివిధ రకాల పూలతో ఇంటి ముందు అందమైన పూల అలంకరణ చేయడం ఐక్యత, సృజనాత్మకతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. అలాగే ఓనసద్య పేరుతో సంప్రదాయ వంటకాలతో భోజనం చేయడం, సంప్రదాయ ఆటలు, నృత్యాలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఓనం వేడుకల్లో ముఖ్యమైన భాగాలని విద్యార్థులకు తెలియజేశారు.పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు కేరళ సంప్రదాయ నృత్యాలు, పాటలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి ఆకట్టుకున్నారు. చిన్నారులకు ఓనం పండుగ ద్వారా సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి పట్ల గౌరవం, సమానత్వం, సోదరభావం, ఐక్యత వంటి విలువలను పరిచయం చేశారు.వివిధ ప్రాంతాలు, భాషలు, సంస్కృతులకు చెందిన విద్యార్థులు కలిసి ఓనం వేడుకల్లో పాల్గొనడం ద్వారా “భిన్నత్వంలో ఏకత్వం” అనే భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని చాటిచెప్పారు. విద్యార్థుల్లో ఇతర రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కేరళిట్స్ స్కూల్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు మరియు జాన్సన్ చలిస్సరీ, పౌలీ మురళి వివిధ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు

# నిరుపేద వృద్ధురాలి అంత్యక్రియలకు హోలీ స్పిరిట్ ఆర్థిక చేయూత

**రూ.6 వేల ఆర్థిక సాయం అందజేత**

**చెవిటి, మూగ మహిళకు అండగా నిలిచిన స్వచ్ఛంద సంస్థ**

**మానవత్వాన్ని చాటుకున్న హోలీ స్పిరిట్ సభ్యులు**



నిరుపేద వృద్ధురాలి కుటుంబానికి రూ.6 వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్న హోలీ స్పిరిట్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

**ఎటపాక, ఆగస్టు 30 (ప్రజాజ్యోతి):**నిరుపేద వితంతు వృద్ధురాలి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేసి స్థానిక హోలీ స్పిరిట్ స్వచ్ఛంద సేవా సంస్థ మానవత్వాన్ని చాటుకుంది. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న సంస్థ మరోసారి తన ఔన్నత్యాన్ని చాటుకుంది. ఎటపాక మండలం గౌరీదేవిపేట పంచాయతీ పరిధిలోని గన్నేరుకొయ్యపాడు గ్రామానికి చెందిన గవ్వల సాయమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. పుట్టుకతోనే చెవిటి, మూగ అయిన సాయమ్మకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిద్దరికీ వివాహాలు కావడంతో వేరే ప్రాంతాల్లో నివసిస్తున్నారు. దీంతో సాయమ్మ గ్రామంలో ఒంటరిగా జీవనం సాగిస్తూ వచ్చింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అంత్యక్రియల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా ఉండటంతో విషయం తెలుసుకున్న హోలీ స్పిరిట్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు వెంటనే స్పందించారు. సభ్యుల నుంచి అప్పటికప్పుడు విరాళాలు సేకరించి రూ.6 వేల నగదును మృతురాలి కుమార్తెలు మరియమ్మ, తిరుపతమ్మలకు అందజేశారు. ఒంటరిగా జీవిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సాయమ్మ కుటుంబానికి అంత్యక్రియల సమయంలో హోలీ స్పిరిట్ సభ్యులు అండగా నిలవడం స్థానికంగా పలువురిని ఆకట్టుకుంది. కష్టాల్లో ఉన్న వారికి తమకు చేతనైనంత సాయం అందించడం అభినందనీయమని గ్రామస్తులు కొనియాడారు.

**సామాజిక సేవలో హోలీ స్పిరిట్ ప్రత్యేక గుర్తింపు**

ఈ సందర్భంగా హోలీ స్పిరిట్ సభ్యులు మాట్లాడుతూ.. తొలుత క్రీస్తు కళానాట్య మండలి పేరుతో 1985లో సంస్థను ప్రారంభించి, అనంతరం హోలీ స్పిరిట్ పేరుతో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో విరాళాలు సేకరించి బాధితులకు ప్రభుత్వాల ద్వారా సహాయం అందించామని పేర్కొన్నారు. సునామీ సమయంలో సర్వం కోల్పోయిన బాధితులకు, మృతుల కుటుంబాలకు సైతం విరాళాలు సేకరించి ఆపన్నహస్తం అందించినట్లు గుర్తుచేశారు. అదేవిధంగా ప్రతి ఏటా డివిజన్, మండల స్థాయిల్లో పాఠశాల విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహిస్తూ వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సైన్స్, గణితం, ఇంగ్లిష్, కరెంట్ అఫైర్స్ తదితర అంశాల్లో ప్రశ్నపత్రాలను రూపొందించి వివిధ దశల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్నామని చెప్పారు. సంస్థ ప్రారంభ దశలో సమాజంలో చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో గ్రామాల్లో సాంఘిక నాటికలు ప్రదర్శించి ప్రజల్లో సామాజిక అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి రోజ్‌కాంత్, వసంతాల శివకుమార్, దారా రవి, రమేష్, ప్రసాద్, సంజీవ రావు, భాస్కరరావు, కొండయ్య తదితర హోలీ స్పిరిట్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీనియర్ వైయస్సార్సీపీ నేత పెడబల్లె గణేష్ రెడ్డి మృతికి ప్రముఖుల సంతాపం



**చెన్నూరు, ఆగస్టు 30:** స్థానిక చెన్నూరు టౌను రెడ్డివారి వీధికి చెందిన మాజీ కడప మార్కెట్ యార్డ్ చైర్మన్ పెడబల్లె గణేష్ రెడ్డి (66) అనారోగ్యంతో హైదరాబాదులోని వారి కుమార్తె స్వగృహంలో ఆదివారం తెల్లవారుజామున మరణించారు. గణేష్ రెడ్డి మృతదేహాన్ని చెన్నూరు రెడ్డివారి వీధిలోని వారి స్వగృహమునకు తెచ్చారు. వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు శ్రీ పి. రవీంద్రనాథ్ రెడ్డి మరియు జిల్లా,నియోజకవర్గ మరియు మండల ప్రముఖులు మంచి మనిషి, నిజాయితీ, నిబద్ధత కలిగిన వైయస్సార్సీపి నాయకుడు గణేష్ రెడ్డి మృతదేహంపై పూలమాలవేసి ఘనంగా నివాళుల అర్పించి, ప్రగాడ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా. వైఎస్ ఆర్సిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ వివాద రహితుడు, సహనశీలి అయిన మాజీ కడప మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీ పెడబల్లె గణేష్ రెడ్డి వైఎస్ఆర్సిపి పార్టీ బలోపేతానికి, మండల పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన మరణం అత్యంత బాధాకరమని, పార్టీకి స్థానిక ప్రజలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. పార్టీ మరియు తాము ఎల్లప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ జీ.ఎన్. భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివరామిరెడ్డి, రాష్ట్ర నాయకులు టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్,మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి మన్నెం సుబ్బారెడ్డి, రాధమ్మ, దేవగుడి భాస్కర్ రెడ్డి, శివయ్య యాదవ్, ఓబుళంపల్లె చంద్ర, చల్లా వెంకట సుబ్బారెడ్డి బాబు, అన్వేష్ రెడ్డి, చంద్ర, ఎంపీటీసీ చంద్ర, వెంకట రమణ, అల్లి శ్రీరామ్మూర్తి, సాగర్, మిట్టా మాధవరెడ్డి, ఎంపీటీసీ నిరంజన్ రెడ్డి, శివారెడ్డి, కుమార్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, నిత్య, శ్రీనివాస రాజు, నవాజ్, అన్వార్, రబ్, వారిస్, లక్ష్మమయ్య, మాజీ ఎంపీపీ శివరామిరెడ్డి, కృష్ణ కొండరెడ్డి, సంపూర్ణశ్ రెడ్డి, జగన్నాథం, రామాంజనేయులు తదితర వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మరియు గారు చనిపోయారని తెలుసుకొని వారి ఇంటివద్దకు పోయి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# రాష్ట్రప్రగతికి బాటలు!.. సంక్షేమ పథకాలకు సృష్టికర్త!..





**మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు!..**
**జడ్పీ.టి.సి వాళ్ళ రంగారెడ్డి!..**
**తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొర్ర నరేష్ కుమార్!..**



**వి.ఆర్.పురం, ఆగస్టు 30 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** రాష్ట్రప్రగతికి కూటమి ప్రభుత్వం అద్భుతమైన సంక్షేమ పథకాలు, అత్యద్భుమైన అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ పక్కరాష్టాలు నివ్వెరబోయేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, కొణిదెల పవన్ కళ్యాణ్, పరిపాలన అందిస్తున్నారని, జడ్పీ.టి.సి వాళ్ళ రంగారెడ్డి,తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొర్ర నరేష్ కుమార్,స్పష్టం చేశారు. ఆదివారం వరరామచంద్రా పురం, మండలం రామవరం పంచాయతీ రామవరం గ్రామం లో,గ్రామశాఖ అధ్యక్షులు గొర్రె సీతా రాములు, ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం అభివృద్ధి- సంక్షేమం డోర్ "టూ"డోర్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇంటింటికి వెళ్లి ప్రభుత్వంఈరెండేళ్ల పాలనలో ప్రజలకు అందించినటువంటి అన్నిరకాల సదుపాయాలను వివరిస్తూ అనేక సమస్యలను తెలుసుకుంటూ కార్యక్రమాన్ని దిగ్విజయంగా జయప్రదం చేశామని వివరించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ నిధులుగాని,విశాఖ కేంద్రంగా సౌత్ కోస్టల్ రైల్వే జోన్ గాని,భోగాపురం ఎయిర్పోర్ట్ గాని,రాష్ట్ర ప్రగతికి సంబంధించి అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలన్నీ కూటమిప్రభుత్వంతోనే సాధ్యమైందని, సూచించారు. రాష్ట్ర ప్రగతి బాగుంటే ఉపాధి అవకాశాలు అద్భుతంగా ఉంటాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమవిజయాల్లో భాగంగాఎన్టీఆర్ భరోసా,తల్లికి వందనం, దీపంపథకం, స్త్రీశక్తి, ఆటో డ్రైవర్ల సేవలు,అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ వైద్యసేవతో పేదలకు ఉచిత వైద్యసేవలు,సి. ఎమ్, ఆర్, ఎఫ్,ద్వారా లక్షల కుటుంబాలకు ఆర్థికసాయం వంటి ఎన్నోకార్యక్రమాలు ప్రజలకు అందిస్తున్నామని,ఇది కూటమి ప్రభుత్వంతోనే సాధ్యంమని, తెలియజేశారు. ముందు చూపుతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, చేసేప్రతీ అభివృద్ధి భవిష్యత్ తరాలకు మంచి ఫలితాలు ప్రతి బింబిస్థాయిని, సూచించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే16 వేల ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాల సృష్టికర్త ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,వారు చెప్పారు.ఈ కార్యక్రమం లో పార్టీ ప్రధాన కార్యదర్శి పాయం రామారావు, యూనిట్ ఇన్చార్జులు బీరకా సూర్య ప్రకాష్ రావు, సీనియర్ నాయకులు బొర్రా నరసింహారావు,ఐ.టి.డి.పి, కన్వీనర్ ఆకోజు భాగ్యలక్ష్మి,కోట్ల బాలయ్య, తెల్లం అప్పారావు, రేవు సింహాచలం,గొర్రె కృష్ణ, మడకం రాజు, గొర్రె వెంకటేశ్వర్లు, మీడియం వీరయ్య, ఆకోజు రంగాచారి,బి సురేష్,నారకొండ బ్రహ్మయ్య,కూర బ్రహ్మయ్య, ఎస్ శ్రీరాములు,గొర్రె రాముడు మరియు గ్రామస్తులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

## దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

**భక్తులతో కిటకిటలాడిన దేవరగట్టు**



**హోళగుంద, ఆగస్టు 30, ప్రజా జ్యోతి న్యూస్ -** శ్రావణమాసం మూడవ ఆదివారం సందర్భంగా దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం ఉదయం నుంచే పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ చైర్మన్ వీర నాగప్ప, ఉప చైర్మన్ లోక్య నాయక్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలూరు తాలూకా ఏపీయూడబ్ల్యూజే సంఘం ఉపాధ్యక్షులు, సీనియర్ పాత్రికేయులు హెచ్. విరుపాక్షి, ఆయన సతీమణి హెచ్. మేనకారాణి, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి జలాభిషేకం, పసుపు బండారార్చన పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.అనంతరం విరుపాక్షి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు పర్యవేక్షించారు. సర్వమంగళకరమైన మాల మల్లేశ్వర స్వామి దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

## పీజీఆర్ఎస్‌కు హెచ్ఓడీలు హాజరు కావాలి



**బాపట్ల ఆగస్టు 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వాసుదేవ సూచించారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు గతంలో అందిన అర్జీల పరిష్కారంపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారు.గతంలో ఇచ్చిన ఫిర్యాదులు పరిష్కారం కాకపోయినా, వాటి ప్రస్తుత పరిస్థితిని తెలుసుకోవాలన్నా ప్రజలు పీజీఆర్ఎస్ ద్వారా అధికారులను సంప్రదించవచ్చున్నారు. అలాగే 1100 టోల్‌ఫ్రీ నంబర్, మీకోసం వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేసుకుని సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ సూచించారు.

## భక్తిశ్రద్ధలతో భీరలింగేశ్వరస్వామి కుంభోత్సవం

**శ్రావణ మాసం మూడో ఆదివారం**
**పురస్కరించుకుని వైభవంగా ప్రత్యేక పూజలు**





**హోళగుంద ఆగస్టు 30, ప్రజా జ్యోతి న్యూస్ -** మండల కేంద్రంలోని ఈర్లకట్ట వద్ద వెలసిన భీరలింగేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణ మాసం మూడో ఆదివారం సందర్భంగా భీరలింగేశ్వరస్వామి కుంభోత్సవాన్ని కురువ సంఘం నాయకులు, కుల పెద్దలు, భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ వేడుకలు ఈ ఏడాది కూడా భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగాయి.ఉత్సవాల్లో భాగంగా ముందుగా గ్రామంలోని పెద్దబావి వద్ద గంగిపూజ నిర్వహించారు. అనంతరం భక్తులు భీరప్ప డోలులతో పాటు మేళతాళాల నడుమ కుంభాలను తీసుకుని గ్రామంలోని ప్రధాన పురవీధుల గుండా ఊరేగింపుగా ఈర్లకట్ట వద్ద ఉన్న భీరలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో స్వామివారికి ఆకుపూజ, అభిషేకం, నైవేద్య సమర్పణ, మహా మంగళహారతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.పూజా కార్యక్రమాల అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులు, కులస్థుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సంప్రదాయ ఆచారాలతో నిర్వహించిన కుంభోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి.ఈ వేడుకల్లో హోళగుంద గ్రామ కుల పెద్దలు, కురువ సంఘం నాయకులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

## ఉచిత కంటి, చర్మ వ్యాధుల వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు.



**పోదూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. ఆగస్టు 30.** యలమంచిలి మండలం బూరుగుపల్లి గ్రామంలో ఆదివారం పాలకొల్లు సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి, చర్మ వ్యాధుల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ గనిశెట్టి వెంకటకృష్ణ, చర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ పెనుగొండ రాజితలు 40 మందికి కంటి సమస్యలు, చర్మ వ్యాధులకు ఉచితంగా చికిత్స అందించి తగు వైద్య సలహాలను ఇచ్చారు. బూరుగుపల్లి గ్రామానికి చెందిన పెనుగొండ సీతారామయ్య సత్యవతి దంపతుల సంస్మరణకు వారి కుమారుడు పెనుగొండ సూర్యనారాయణ, నాగ తులసి దంపతుల సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించారు. అనంతరం సూర్యనారాయణ దంపతులు వారి కుటుంబ సభ్యులయిన శిరిగినీడి సత్యనారాయణ, సంగీత, కోటిపల్లి మణికంఠ, సాయిహరిత లు వృద్ధులకు ఉచితంగా చీరలు, లుంగీలు, బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు యర్రంశెట్టి వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి జి.ఎస్.ఎన్. మూర్తి ప్రతినిధులు యర్రమిల్లి నరసింహారావు (వై ఎన్ ఆర్ ) కలిదిండి వెంకటపతి వర్మ, సలాది సత్యనారాయణ మూర్తి, దేవరపు మల్లేశ్వరరావు, జద్దు బదరీ నారాయణ, మంచెం రమేష్, చెరుకూరి మావుళ్లు తదితరులు పాల్గొన్నారు.

# 220 మందికి ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షలు



**ముత్తుకూరు ఆగస్టు 30( ప్రజా జ్యోతి)** 220 మందికి ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షలు ముత్తుకూరు మండల కేంద్రంగా జరిగినాయి. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా స్వర్ణ అలర్జీ అండ్ చెస్ట్ కేర్ సెంటర్ నెల్లూరు ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు కాగా వైద్య సేవలు కోసం అవసరమైన రోగులు పాల్గొన్నారు. కన్సల్టెంట్ సీనియర్ చెస్ట్ ఫిజీషియన్ (ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు) డాక్టర్ కె పెంచల రెడ్డి ఉచిత వైద్య ఆరోగ్య పరిక్షలు నిర్వహించారు. 11 రకాల జబ్బులకు వైద్య సేవలు చేశారు. హాస్పిటల్ యాజమాన్యం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య సేవలు పట్ల విచ్చేసిన రోగులు కృతజ్ఞతలు తెలిపారు.జలుబు ,దగ్గు ,ఆయాసం, అన్ని రకమల జ్వరములు, డస్ట్ అలర్జీ, ఊపిరితిత్తుల సమస్యలు, గ్యాస్ ట్రబుల్, నిద్ర లోపం, మానసిక ఒత్తిడి, ఒళ్ళు నొప్పులు, టీబీ వ్యాధులకు వైద్య నిపుణులు ఉచిత వైద్యం అందించారు. ప్రధానంగా చిన్నపిల్లలకు ప్రత్యేకంగా వైద్యం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు డాక్టర్ కె పెంచల రెడ్డి మాట్లాడారు. ప్రాజెక్టుల ప్రాంతంలో పొల్యూషన్ ఎక్కువగా ఉంటుందని ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. తగు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. తప్పనిసరిగా మాస్కు ధరించాలని ఆయన ప్రజలకు తెలియజేశారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారిలో అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కృష్ణారెడ్డి ,కోటిరెడ్డి, చలపతి, వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్ ,రవి (సుంకర) తదితరులు పాల్గొన్నారు

## ఉరుకుంద పుణ్యక్షేత్రంలో డిప్యూటీ కమిషనర్ కే.వాణి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు



**కౌతాళం ఆగస్టు 30 ప్రజా జ్యోతి** కౌతాళం మండల పరిధిలోనే ఉరుకుంద గ్రామంలో వేలసిన శ్రీ లక్ష్మీనరసింహ ఈరన్న స్వామి దేవస్థానము నందు ఆదివారం రోజు 3వ వారము సందర్భముగా భక్తుల కాలక్షేపము కొరకు శ్రీమతి కె.వాణి, డిప్యూటీ కమీషనర్ వారు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమము ఏర్పాటు చేయడమైనది.దేవాలయాల్లో భక్తులను అలరించేందుకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులను అలరించేలా కళారాధనలో భాగంగా ప్రత్యేక భజనలు, ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ వాణి మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధిలో భాగంగా దేవాలయాలను కేవలం పూజా కేంద్రాలుగానే కాకుండా ప్రాచీన సంప్రదాయ కళలు, సాంస్కృతిక వారసత్వ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని పండుగలు ఆమె తెలిపారు.

## ఓటర్ల అభ్యంతరాలపై విచారణ వేగవంతం




బాపట్ల ఆగస్టు 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) ఎంపీడీవో బాబురావు పర్యవేక్షణలో బాపట్ల మండలంలోని గ్రామపంచాయతీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల ముసాయిదా జాబితాలపై వచ్చిన అభ్యంతరాల పరిశీలన కొనసాగుతోంది. రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు, 2026 నేపథ్యంలో నాలుగు గ్రామపంచాయతీల్లో నమోదైన అభ్యంతరాలపై గ్రామస్థాయి కమిటీల ద్వారా క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నారు.ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలు తెలిపేందుకు ఈ నెల 28వ తేదీ వరకు అవకాశం కల్పించగా, చెరువు జమ్ములపాలెం, కంకటపాలెం, మూలపాలెం, మర్రిపూడి గ్రామపంచాయతీల నుంచి మొత్తం 85 అభ్యంతరాలు అందాయి. వీటిలో చెరువు జమ్ములపాలెంలో 56, కంకటపాలెంలో 13, మూలపాలెంలో 11, మర్రిపూడిలో 5 అభ్యంతరాలు నమోదయ్యాయి.జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి ఈ నెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీలోగా విచారణ పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా చెరువు జమ్ములపాలెంలో ఎస్టీ వర్గాలకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలపై అధికారులు గ్రామానికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు.అభ్యంతరాలపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని, ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని ఎంపీడీవో బాబురావు అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణ, పంచాయతీ అభివృద్ధి అధికారి చిరంజీవి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మాతృ యోగంలో ఉన్న వీరాస్వామి నాయుడుని పరామర్శించిన వైయస్సార్సీపి రాష్ట్ర ఆర్టిఐ జోన్ టు అధ్యక్షులు కొల్లు రవీంద్ర వర్మ

**అంబేద్కర్ కోనసీమ జిల్లా**



**ఆగస్టు 30 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** గోడితిప్ప గ్రామ పంచాయతీ ఏరియాలోని గోపాలంక గ్రామ కాపరస్తులు ప్రముఖ కాంట్రాక్టర్ కొల్లాటి వీరాస్వామి నాయుడు ఆయన తల్లి అయిన కోల్లాటి సత్యవతి కాలం చేసి ఉన్నారు మాతృవియోగంతో బాధపడుతున్న వీరాస్వామి నాయుడుని పరామర్శించడానికి వైయస్సార్ సి పి రాష్ట్ర ఆర్టిఐ జోన్ టు అధ్యక్షులు కొల్లు త్రినాధ వర్మ , పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ నాకు ముగ్గురు సోదరులని నా తల్లిగారు మా కుటుంబాన్ని సమర్ధవంతంగా ఆదరించా రనీ ఆమె గృహిణిగా తల్లిగా సేవలందించారని ఆమె అకాల మరణం మమ్మల్ని బాధించిందని ఆమె మరణం మాకు తీరనిలోటు గా మిగిల్చిందని ఆయన వాపోయారు ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ మా తండ్రిగారైన కొల్లు సూర్య నారాయణ మూర్తి తో వీరాస్వామి నాయుడు తండ్రి కొల్లాటి సత్యనారాయణతో మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయని అదే విధంగా కొల్లాటి సుబ్బారావు మీ సోదరుడు మా క్లాస్మేట్ అని గుర్తు తెచ్చుకోవడం జరిగింది పరామర్శించడానికి వెళ్లిన వారిలో వర్మ వెంట బొమ్మిడి బాబురావు మాజీ ఎంపీటీసీ( రెబ్బనపల్లి,) కొల్లు మల్లేశ్వరరావు (సామంత్కూరు )వైఎస్ఆర్సిపి గ్రామ కమిటీ అధ్యక్షులు, సోదరులు కొల్లు మురళీకృష్ణ రాజాజీ మరియు గూడాల పుల్లంశెట్టి తదితరులుపరామర్శించిన వారి లో ఉన్నారు. వీరాస్వామినాయుడు తల్లి గారిఆత్మ శాంతించాల ని వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని పలువురు సంతాపం తెలియజేసినారు

# బాపట్ల అభివృద్ధికి పర్యాటకమే కొత్త బాట

**సూర్యలంక కేంద్రంగా మారుతున్న జిల్లా.**

**కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రత్యేక దృష్టి**




**బాపట్ల ఆగస్టు 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** సముద్ర తీరం, ప్రకృతి అందాలు, చారిత్రక ప్రదేశాలు, వ్యవసాయం, మత్స్యరంగం వంటి ఎన్నో ప్రత్యేకతలు ఉన్న బాపట్ల జిల్లా ఇప్పుడు పర్యాటక అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా సూర్యలంకను కేంద్రంగా చేసుకుని తీర ప్రాంతాన్ని పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వాసుదేవా పర్యాటక రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ వివిధ శాఖలను సమన్వయం చేస్తున్నారు.సూర్యలంక బీచ్ అభివృద్ధికి స్వదేశ దర్శన్,2.0 కింద రూ.97.52 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. పర్యాటకులకు మెరుగైన మౌలిక వసతులు, విశ్రాంతి సదుపాయాలు, వసతి, భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అదే సమయంలో సూర్యలంకలో అడ్వెంచర్ టూరిజానికి కూడా అనుమతులు లభించ డంతో బాపట్ల తీర ప్రాంతానికి మరింత గుర్తింపు వచ్చే అవకాశం ఏర్పడింది.కేవలం పర్యాటకులను ఆకర్షించడమే కాకుండా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా పర్యాటక అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలన్న దిశగా అధికార యంత్రాంగం దృష్టి సారిస్తోంది. పర్యాటకుల భద్రత, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, స్థానిక మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సూర్యలంకతో పాటు వాడరేవు, రామాపురం వంటి తీర ప్రాంతాలను కూడా పర్యాటక సర్క్యూట్‌లో భాగంగా అభివృద్ధి చేసే అవకాశాలు జిల్లాకు మరింత బలాన్ని ఇవ్వనున్నాయి.ఇప్పటికే బే ఆఫ్ బాపట్ల పేరుతో జిల్లా తీర ప్రాంత పర్యాటకానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. సూర్యలంక అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు అడ్వెంచర్ టూరిజం, బీచ్ భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను కలిపి ముందుకు తీసుకెళ్లడం ద్వారా బాపట్లను ప్రత్యేక పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దే దిశ కనిపిస్తోంది.పర్యాటక రంగం అభివృద్ధి చెందితే హోటళ్లు, రవాణా, చిరు వ్యాపారాలు, స్థానిక ఉత్పత్తులు, హస్తకళలు, ఆహార రంగంతో పాటు యువతకు వివిధ ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. అందువల్ల బాపట్ల అభివృద్ధిలో పర్యాటక రంగం కీలక పాత్ర పోషించనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇప్పటివరకు ప్రశాంతమైన తీర ప్రాంతంగా ఉన్న సూర్యలంకకు ఆధునిక సదుపాయాలు జతకడితే రానున్న రోజుల్లో బాపట్ల జిల్లా పర్యాటక పటంలో మరింత ప్రత్యేక స్థానాన్ని సంపాదించే అవ కాశం ఉంది. ఈ దిశగా కలెక్టర్ పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి అధికారులతో సమన్వయం చేస్తుండటం అభివృద్ధికి మరింత ఊతమిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

## టిడిపి మండల మైనార్టీ జనరల్ సెక్రెటరీ గా బ్రెడ్ సికిందర్ ఎంపిక..




**కంబదూరు ఆగస్టు:30(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండల తెలుగుదేశం పార్టీ మైనార్టీ జనరల్ సెక్రెటరీ గా బ్రెడ్ సికిందర్, నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నన్ను మండల మైనార్టీ జనరల్ సెక్రెటరీ గా ఎంపిక చేసిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, కు మండల టిడిపి నాయకులు మాజీ జడ్పీ విపక్షనేత కరణం రామ్మోహన్ చౌదరి, మాజీ సర్పంచ్ గాజుల శ్రీరాములు, మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ, దండా వెంకటేశులు, మండల కన్వీనర్ శివన్న, లకు మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాపై ఎంతో నమ్మకంతో పార్టీ పదవిని అప్పగించడంతో మరింత బాధ్యతగా పనిచేసి టిడిపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

# రాష్ట్ర స్థాయి పోటీల్లో పీడీ నాగిరెడ్డి సత్తా

**షాట్‌పుట్‌లో బంగారు పతకం కైవసం**

**జింఖానా మైదానంలో ఘనంగా 'స్టేట్ ఆఫ్ సీజన్ మీట్-2026'**

**45 ఏళ్ల విభాగం షాట్‌పుట్‌లో అగ్రస్థానం**

**పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల హర్షం**


రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ లో స్వర్ణం సాధించిన నాగిరెడ్డి.

**ఎటపాక, ఆగస్టు 30 (ప్రజాజ్యోతి):** వయసుతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తిని చాటుతూ గిరిజన ఆశ్రమ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు (పీడీ) ఎస్. నాగిరెడ్డి రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకున్నారు. తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్, నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మరియు తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ గుర్తింపుతో సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో "స్టేట్ ఆఫ్ సీజన్ మీట్-2026" క్రీడా పోటీలు ఘనంగా జరిగాయి. 35 నుంచి 90 ఏళ్ల వయసు కలిగిన పురుషులు, మహిళల్లో ఫిట్‌నెస్ మరియు క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పోలవరం జిల్లా ఎటపాక మండలం నల్లకుంట ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్. నాగిరెడ్డి పాల్గొన్నారు. 45 సంవత్సరాల విభాగం లో జరిగిన షాట్‌పుట్ పోటీలో ఆయన అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి బంగారు పతకం సాధించిన వ్యాయామ ఉపాధ్యాయుడు నాగిరెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటి సీతారాములు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

## దేవరగట్టులో టెంకాయల వేలంపాట

**రూ.4.55 లక్షలకు టెంకాయల వేలం దక్కించుకున్న నేరనికి దేవన్న**



**హోళగుంద ఆగస్టు 30, ప్రజా జ్యోతి న్యూస్ –** దేవరగట్టు శ్రీ మాళ సహిత మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం టెంకాయల వేలంపాటలను ఘనంగా నిర్వహించారు. ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్ ఆదేశాల మేరకు దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ వీర నాగప్ప, వైస్ చైర్మన్ లోక్య నాయక్ ఆధ్వర్యంలో ఈ వేలంపాటలు నిర్వహించినట్లు తెలిపారు.ఆలయానికి సంబంధించిన టెంకాయల వేలంపాటలో పలువురు ఆసక్తిగా పాల్గొనగా, నెరనికి గ్రామానికి చెందిన దేవన్న అనే రూ.4 లక్షల 55 వేల మొత్తానికి వేలాన్ని దక్కించుకున్నారు. వేలంపాటల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. మల్లికార్జున, చాకలి గిరప్ప, ఆలయ కమిటీ సభ్యులు దరగన్న, రంగస్వామి, బి. మల్లయ్య, ఎస్సీ సేకన్న, పీర్‌సాబ్, కొత్తపేట శీను, కొత్తపేట వెంకటేష్, శంకర్ నాయక్, రాజేష్ నాయక్, గేమ్ నాయక్, బొజ్జ నాయక్, నెరనికి తాండా, కొత్తపేట గ్రామ పెద్దలు నర్సా నాయక్, డాక్య నాయక్, నెరనికి హుసేని తదితరులు పాల్గొన్నారు. మూడు గ్రామాలకు చెందిన పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేలంపాటల కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఛలో విజయవాడ ను జయప్రదం చేయండి.

**యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి:**

**అబ్దుల్ లతీఫ్**



**ప్యాపిలి ఆగష్టు 30 (ప్రజాజ్యోతి న్యూస్ )** యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆదివారం ఉదయం యూటీఎఫ్ ప్యాపలి మండల శాఖ ఆధ్వర్యంలో ప్యాపలి ప్రియదర్శిని పాఠశాలలో ఛలో విజయవాడ పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది.అనంతరం యూటీఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి అబ్దుల్ లతీఫ్ మాట్లాడుతూ ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ వేస్తామని మంత్రి చెప్పారు,పేరుకే స్పెషల్ టెట్ కానీ జెనరల్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏ విధంగానూ స్పెషల్ టెట్ ఉపాధ్యాయులకు మేలు చేకూరేలా లేదు .30 నుండి 20 సంవత్సరాలు ఉపాధ్యాయులుగా పనిచేసిన తర్వాత ఇలా టెట్ పేరిట ఉపాధ్యాయులుగా నిరూపించుకోవాలనడం దారుణమని.వయసు పైబడిన ఉపాధ్యాయులు ఏ విధంగా ఇప్పుడు వారికి ఏ మాత్రం అనుభవం లేని పాఠ్యాంశాలు చదివి ఎలా పాస్ కాగలరని,స్పెషల్ టెట్ లో కనీసం అర్హత మార్కులు తగ్గించాలని అడిగినా, వారు బోధిస్తున్న సబ్జెక్ట్ లో పరీక్ష పెట్టనున్న కూడా ప్రభుత్వం పెడచెవిన పెట్టీ నోటిఫికేషన్ విడుదల చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు.అందుకని యూటీఎఫ్ ఆధ్వర్యంలో టెట్ రద్దుకు సెప్టెంబర్ 3 న నిర్వహించే ఛలో విజయవాడ కు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలి రావాలని యూటీఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి అబ్దుల్ లతీఫ్ కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్యాపలి మండల శాఖ సభ్యులు రాజు,అస్మా,పక్కీరమ్మ,సురేష్,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## చల్లా రాజ్యలక్ష్మి టీడీపీ సభ్యత్వానికి రాజీనామా

--గోకవరం టీడీపీలో రాజీనామాల కలకలం



**కాకినాడ జిల్లా ఆగస్టు 30 (ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** గోకవరం మండల తెలుగుదేశం పార్టీలో వరుస రాజీనామాలు రాజకీయ వర్గాల్లో చర్చకు తెరలేపుతున్నాయి.తాజాగా కొత్తపల్లి గ్రామానికి చెందిన టీడీపీ క్రియాశీల సభ్యురాలు చల్లా రాజ్యలక్ష్మి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.కొన్ని అనివార్య కారణాల నేపథ్యంలో పార్టీకి దూరమవుతున్నట్లు పేర్కొంటూ తన రాజీనామా లేఖను టీడీపీ మండల అధ్యక్షుడు పిల్లా చంటిబాబుకు అందజేశారు.తన రాజీనామాను ఆమోదించాలని లేఖలో అభ్యర్థించారు.పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చిన రాజ్యలక్ష్మి ఆకస్మికంగా సభ్యత్వానికి రాజీనామా చేయడం కొత్తపల్లి గ్రామంతో పాటు మండల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది ఇప్పటికే గోకవరం మండల టీడీపీలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతున్న తరుణంలో తాజాగా మరో సభ్యురాలు రాజీనామా చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.రాజ్యలక్ష్మి రాజీనామా వెనుక ఉన్న కారణాలపై రాజకీయ వర్గాల్లో భిన్నమైన చర్చలు సాగుతున్నప్పటికీ,ఆమె మాత్రం అనివార్య కారణాలనే పేర్కొన్నారు.ఇకపై ఆమె రాజకీయంగా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

## బ్రహ్మంగారిని దర్శించుకున్న వైయస్సార్సీపి కడప జిల్లా రైతు విభాగ అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి



**బ్రహ్మంగారిమఠం -ప్రజా జ్యోతి ఆగష్టు 30** మండలంలోని కాలజ్ఞాన సృష్టికర్త జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని ఆదివారం కడప జిల్లా రైతు విభాగ అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం మండల వైఎస్ఆర్సిపి నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షుడు ఎత్తపు సుబ్బారెడ్డి, వైఎస్ఆర్సిపి మైదుకూరు నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు భూమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, మండల రైతు విభాగం అధ్యక్షుడు అన్నపురెడ్డి నారాయణరెడ్డి, జిల్లా వాలంటరీ విభాగ అధ్యక్షుడు నల్లపురెడ్డి ప్రశాంత్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు పసుపులేటి వెంకటేష్, గొడ్లవీడు పంచాయతీ అధ్యక్షుడు పుల్లలచెరువు రమేష్‌రెడ్డి, గొడ్లవీడు రైతు అధ్యక్షుడు అబ్బిరెడ్డి, ఎర్రంపల్లి పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరరెడ్డి, మండల ఎగ్జిక్యూటివ్ సభ్యుడు యేమిరెడ్డి నరసింహారెడ్డి, ఎల్లటూరు మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పుట్టా కృషితో నూతన రామాలయ నిర్మాణానికి భూమి పూజ

**శంకుస్థాపన చేసిన కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి**



**బ్రహ్మంగారిమఠం -ప్రజాజ్యోతి ఆగష్టు 30** మండల పరిధిలోని రేకలకుంట పంచాయతీ చీకటివారిపల్లె గ్రామంలో నూతన రామాలయ నిర్మాణానికి కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ నూతన రామాలయానికి శాస్త్రోక్తంగా భూమి పూజ చేసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆశీస్సులతో, బి. మఠం టీడీపీ మండల అధ్యక్షులు చెన్నుపల్లె సుబ్బారెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఈ సందర్భంగా గ్రామస్తులు తెలిపారు. నూతన రామాలయ నిర్మాణం ప్రారంభం కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు ఆధ్యాత్మికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## మారెమ్మ దేవాలయంలో చోరీ



**కంబదూరు ఆగస్టు:30(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు: మండల పరిధిలోని రాంపురం గ్రామంలో వెలసిన మారెమ్మ దేవాలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. శనివారం రాత్రి ఆలయంలోకి ప్రవేశించిన దుండగులు సుమారు రూ.50 వేల విలువైన అమ్మవారి నగలను అపహరించినట్లు ఎస్ఐ లోకేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ఆలయంలోని సీసీ కెమెరాలను సైతం దుండగులు ధ్వంసం చేసి చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఈ చోరీకి పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆలయంలో చోరీ జరగడంతో రాంపురం గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేసి దుండగులు చోరీకి పాల్పడటంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుండగులను త్వరగా గుర్తించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## త్వరలో అంతర్జాతీయ మార్కెట్లోకి లలితా జువెలరీ

**దక్షిణాది రాష్ట్రాల్లో కొత్తగా 110 స్టోర్లు**

తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) పూర్తి చేసుకున్న ఆభరణాల విక్రయ సంస్థ లలితా జువెలరీ మార్ట్ లిమిటెడ్ వ్యాపార విస్తరణపై పూర్తి స్పష్టతతో ముందుకు సాగుతోందని సంస్థ సీఎండీ ఎం. కిరణ్ కుమార్ తెలిపారు. శనివారమిక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల్లో రిటెయిల్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించడంతోపాటు, అంతర్జాతీయ మార్కెట్లోకి ప్రవేశించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం తమకు 64 షోరూములున్నాయని, వీటికి అదనంగా మరో 110 కేంద్రాలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. 2027 మార్చి నాటికి కనీసం 10 స్టోర్లకు పైగా ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. దక్షిణాదిలో 175 షోరూములకు చేరుకోగానే ఉత్తర భారత్‌కు విస్తరిస్తామని వెల్లడించారు. ఇందులో తొలుత మహారాష్ట్ర, ఆ తర్వాత ఉత్తరప్రదేశ్, దిల్లీ మార్కెట్లు ఉంటాయన్నారు.

**మలేషియా, సింగపూర్‌లో..:** వచ్చే 2-3 నెలల్లో మలేషియాలో షోరూమును ప్రారంభించబోతున్నట్లు కిరణ్ కుమార్ వెల్లడించారు. ఆ తర్వాత సింగపూర్ మార్కెట్లోకి అడుగుపెడతామని పేర్కొన్నారు.

# వాల్మీకి జయంతి నాడు అర్ధనగ్న ప్రదర్శన, భిక్షాటన

**ఎంవీఆర్పీఎస్ హెచ్చరిక ఎస్టీ పునరుద్ధరణ కోసం అసెంబ్లీ ముట్టడికి సైతం వెనుకాడబోం**

**ప్యాపిలి నేతల సన్మాన సభలో స్పష్టం చేసిన రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న**




**ప్యాపిలి , ఆగస్టు 30. (ప్రజాజ్యోతి న్యూస్)**వాల్మీకులను ఎస్టీ జాబితాలో పునరుద్ధరించే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని ఎండగడుతూ భవిష్యత్తులో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని, రానున్న వాల్మీకి మహర్షి జయంతి నాడు అర్ధనగ్న ప్రదర్శనతో పాటు అవసరమైతే భిక్షాటన చేపడతామని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి (ఎంవీఆర్పీఎస్) స్పష్టం చేసింది.

**ప్యాపిలి హైవే నిరసన నేతలకు ఘన సన్మానం**

ఈ నెల 14న ప్యాపిలి జాతీయ రహదారిపై చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించిన ప్యాపిలి ఎంవీఆర్పీఎస్ నాయకులను నంద్యాల జిల్లా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి బాల రంగయ్య, యూత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్, నాయకులు ప్రతాప్, రంగనాయకులు, లోకేష్, నాగరాజు (కలసట్ల), రామాంజి, పెద్దిరాజు, కేసాలు, నరసింహ, కొండయ్య, రామకృష్ణ, మధు, హనుమప్ప, నాయుడు, కృష్ణ, రమేష్‌లను రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న, ప్రధాన కార్యదర్శి లాలుస్వామి తదితరులు శాలువాలతో సత్కరించారు.

**చావో రేవో తేల్చుకుంటాం**
**పులికొండన్న హెచ్చరిక**

ఈ సందర్భంగా ఎంవీఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న, నాగరాజు, బాల రంగయ్య మాట్లాడుతూ.. వాల్మీకుల న్యాయమైన ఎస్టీ డిమాండ్‌పై పాలకులు మొండిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇకపై తాడోపేడో తేల్చుకునేందుకు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే అసెంబ్లీ సమావేశాల సమయంలో అసెంబ్లీ ముట్టడికి దిగుతామని హెచ్చరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీల నాయకులను నిలదీయడంతో పాటు అన్ని స్థానాల్లో స్వతంత్రంగా పోటీ చేస్తామని, సార్వత్రిక ఎన్నికల్లో వాల్మీకుల సత్తా చాటుతామని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఆర్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.జి. నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి జయరాం, లాయర్ సుబ్బారాయుడు, యూత్ జిల్లా ఉపాధ్యక్షులు పరమేష్, నాయకులు ఓబులేసు, సుంకులయ్య, రాజు, గోపాల్, భూపాల్, రమేష్, హరినాథ్, శ్రీనివాస్, శ్రీను, కుమార్, మల్లికార్జున, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# రామాలయ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలి-దేవర అనూష యాదవ్

--పారుపాకలో పరిస్థితిపై ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వెంటనే స్పందించాలని విజ్ఞప్తి
--రాత్రికి రాత్రే విగ్రహాల ఏర్పాటు ఏంటి?దేవర అనూష యాదవ్
--గ్రామంలో శాంతిభద్రతల సమస్య వస్తే బాధ్యత ఎవరిది?-
--వర్గపోరుకు ఆజ్యం పోయొద్దు..రామాలయ నిర్మాణం నిలిపివేయాలి



**కాకినాడ జిల్లా ఆగస్టు 30 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు నియోజకవర్గం,రౌతులపూడి మండలం పారుపాక గ్రామంలో చేపడుతున్న రామాలయ నిర్మాణంపై వివాదం నెలకొంది. ఈ విషయంపై పలువురు గ్రామ ప్రజలు తెలుగు మహిళా జాగృతి అధ్యక్షురాలు దేవర అనూష యాదవ్‌ను ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో కలిసి,గ్రామ సచివాలయం ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో రామాలయ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా దేవర అనూష యాదవ్ మాట్లాడుతూ చిన్న గ్రామంలో ఇప్పటికే ఒక రామాలయం ఉండగా రెండో రామాలయం నిర్మించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఎలాంటి ముందస్తు నిర్ణయం, గ్రామ ప్రజల సమ్మతి లేకుండా రాత్రికి రాత్రే విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రయత్నించడంలో ఆంతర్యమేంటని నిలదీశారు. రామాలయ నిర్మాణం విషయంలో గ్రామంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయని,ఇటువంటి పరిస్థితుల్లో నిర్మాణాన్ని కొనసాగించడం వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తితే అందుకు బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ఆలయ నిర్మాణానికి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించాలని కోరారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పడాల తిరుమల వెంకన్న దొర కారణంగా వర్గపోరు ఏర్పడే పరిస్థితులు ఉన్నాయని అనూష యాదవ్ ఆరోపించారు. గ్రామంలో ఇప్పటికే ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూడాలని కోరారు. ఇదిలా ఉండగా సచివాలయం,రైతు సేవా కేంద్రం పక్కన పశువులకు వైద్యం అందించేందుకు బోను నిర్మించుకోవాలని గ్రామ ప్రజలు నిర్ణయించుకున్నట్లు గ్రామానికి చెందిన గుంటబోయిన చిట్టిబాబు,వియ్యపు నూకరాజు తెలిపారు. ఇప్పటికే ఈ స్థలంలో ఏర్పాటు చేసేందుకు బోనును జిల్లా కలెక్టర్ అందించారని పేర్కొన్నారు. ఈ స్థలానికి సంబంధించిన అంశంపై హైకోర్టును ఆశ్రయించినట్లు వారు తెలిపారు. విషయం న్యాయస్థానం పరిధిలో ఉండగానే అక్కడ నిర్మాణం చేపట్టడం ఏంటని ప్రశ్నించారు. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై నిర్మాణం కొనసాగించడం సరైనది కాదని,దీనివల్ల గ్రామంలో మరింత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని అనూష యాదవ్ పేర్కొన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వెంటనే స్పందించి పరిస్థితిని పరిశీలించాలని కోరారు. రామాలయ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని,గ్రామంలో శాంతిభద్రతలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని మీడియా ముఖంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నక్కా అబ్బులు,గుంటబోయిన నాగేశ్వరరావు, ఉల్లంకుల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# యువతకు పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ గొప్ప అవకాశం

**వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పోలీస్ నియామకాలకు సిద్ధమవుతున్న మహబూబాబాద్ జిల్లా యువతీ యువకులకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పోలీస్ కానిస్టేబుల్ ఒ ఎస్ఐ కోచింగ్ శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, మహబూబాబాద్ శాసనసభ్యులు మురళి నాయక్, చైర్‌పర్సన్ జ్యోతి, జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్, ఐఏఎస్, ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ ఉచిత శిక్షణ శిబిరం ఎంతో మంచి అవకాశమని అన్నారు. పోలీస్ ఉద్యోగాన్ని లక్ష్యంగా పెట్టుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు నాణ్యమైన ఉచిత శిక్షణ అందించేందుకు ముందుగా 1,056 మంది అభ్యర్థులను స్క్రీనింగ్ టెస్ట్‌కు ఎంపిక చేసి, అందులో 500 మంది అభ్యర్థులను ఉచిత శిక్షణకు ఎంపిక చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎంపికైన 500 మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు ప్రత్యేక ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన భాగ్యకిరణ్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి వచ్చే అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో నాణ్యమైన శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులకు శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్ మరియు భోజన సదుపాయాలను కూడా ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ జిల్లా కలెక్టర్, ఎస్పీ లను ఆదర్శంగా తీసుకొని యువత కష్టపడి ఉద్యోగాలు సాధించాలి: వేం నరేందర్ రెడ్డి ముఖ్య అతిథి వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ



మహబూబాబాద్ జిల్లాలోని యువతకు పోలీస్ ఉద్యోగాల్లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎంతో చక్కటి ఉచిత కోచింగ్ అందిస్తున్నారని అన్నారు. భద్రాద్రి జోన్ పరిధిలో కేటాయించిన పోలీస్ ఉద్యోగాల ఖాళీలను ప్రస్తావిస్తూ, మహబూబాబాద్ జిల్లాకు కేటాయించిన పోస్టులను లక్ష్యంగా చేసుకుని అభ్యర్థులు కష్టపడి సిద్ధం కావాలని సూచించారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ సంకల్పంతో ప్రారంభించిన ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమం అభ్యర్థులకు ఎంతో గొప్ప అవకాశమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు అండగా ఉంటుందని తెలిపారు.

అభ్యర్థులు నిరుత్సాహపడకుండా కష్టపడి, అవసరమైతే నిద్రలేని రాత్రులు గడుపుతూ లక్ష్యసాధన కోసం సిద్ధమై ఉద్యోగాలను సాధించాలని పిలుపునిచ్చారు. భాగ్యకిరణ్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ద్వారా శిక్షణ పొంది తమలోని ప్రతిభను వెలికితీసి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ప్రతిభ ఉన్న అభ్యర్థులను గుర్తించి వారికి సరైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే మహబూబాబాద్ జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో యువత పోలీస్ ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్య, ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారించాలని సూచించారు. యువతకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు, అవకాశాలు కల్పించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిరుద్యోగ యువత కోసం అనేక నోటిఫికేషన్లు జారీ చేసి ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత ప్రభుత్వానీ దన్నారు, భారీగా 562 గ్రూప్ వన్ ఉద్యోగాలు నోటిఫికేషన్లు జారీ చేసి పారదర్శకంగా నియామకాలు జరిపేమని తెలిపారు, అదేవిధంగా టీచర్స్ మెగా డీఎస్సీ, వైద్య ఆరోగ్యశాఖ తదితర విభాగాలలో ఉద్యోగాల భర్తీ చేయడం జరిగిందన్నారు,

# తిరుమల తరహాలో వాడపల్లి దివ్యక్షేత్రం అభివృద్ధి


ప్రసాద్ స్కీమ్ ద్వారా కేంద్ర నిధులు తీసుకొచ్చేందుకు కృషి: కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ.

టెంపుల్ సిటీగా వాడపల్లి అభివృద్ధికి ప్రణాళిక: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు..

రూ.6.25 కోట్ల సీజీఎఫ్ నిధులతో నిర్మించిన నూతన వకుళమాత అన్నదాన భవనాన్ని ప్రారంభించిన కేంద్ర సహాయ మంత్రి, ప్రజా ప్రతినిధులు...








**ఆలమూరు ఆగష్టు 30(ప్రజాజ్యోతి):**కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్రాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి, నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మ, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. వాడపల్లి క్షేత్రాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందుతున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు.వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో రూ.6.25 కోట్ల సీజీఎఫ్ (కామన్ గుడ్ ఫండ్) నిధులతో నిర్మించిన నూతన వకుళమాత అన్నదాన భవనాన్ని ఆదివారం కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ప్రారంభించారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ వాడపల్లి ఆలయం ఒక్క కోనసీమ ప్రాంతానికే పరిమితమైన క్షేత్రం కాదని, దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షిస్తున్న ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఆలయంలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అన్నదానం అన్ని దానాలకంటే గొప్పదని, స్వామివారి దర్శనానికి వచ్చే ఏ భక్తుడూ ఆకలితో వెళ్లకూడదనే ఉద్దేశంతో ఇంత భారీ స్థాయిలో అన్నదాన భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. నూతన భవనంలో ఒకేసారి సుమారు 2,000 నుంచి 2,500 మంది భక్తులు భోజనం చేసే సౌకర్యం ఉందని తెలిపారు. ఆధునిక వంట పరికరాలతో రోజుకు సుమారు 40 వేల మందికి ప్రసాదం సిద్ధం చేసే సామర్థ్యం కల్పించారని పేర్కొన్నారు. వాడపల్లి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర పర్యాటక శాఖ పరిధిలోని 'ప్రసాద్' స్కీమ్ ద్వారా నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని శ్రీనివాస వర్మ హామీ ఇచ్చారు. ఈ విషయంపై కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి వాడపల్లి ఆలయానికి నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే ఆలయ అభివృద్ధికి కామన్ గుడ్ ఫండ్, టీటీడీ నుంచి కూడా నిధులు సమకూర్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.దేవుడికి మనం దానం చేస్తున్నామనే భావన కాకుండా, మనకు లభించిన సంపదలో కొంత భాగాన్ని భగవంతుడికి సమర్పించుకునే అవకాశం కల్పించడం కూడా ఆయన అనుగ్రహమేనని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.

**పెరిగిన ఆలయ ఆదాయం**

ప్రస్తుత పాలకమండలి ఆధ్వర్యంలో ఆలయ ఆదాయం గణనీయంగా పెరిగిందని కేంద్ర మంత్రి తెలిపారు. గతంలో శనివారం టికెట్ల ద్వారా సుమారు రూ.30 లక్షల ఆదాయం వచ్చేదని, ప్రస్తుతం అది సుమారు రూ.కోటికి చేరిందని చెప్పారు. అలాగే గతంలో నెలకు సుమారు రూ.కోటి ఉన్న హుండీ ఆదాయం ప్రస్తుతం రూ.2 కోట్లకు చేరిందని వెల్లడించారు. భక్తుల్లో ఆలయంపై పెరిగిన నమ్మకం, విశ్వాసమే ఆదాయం పెరగడానికి ప్రధాన కారణమన్నారు.

**టెంపుల్ సిటీగా వాడపల్లి**

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ వాడపల్లి క్షేత్రం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. స్వామివారిని దర్శించుకుని సేవించిన భక్తుల కోరికలు నెరవేరుతున్నాయనే విశ్వాసంతో లక్షలాది మంది భక్తులు వాడపల్లికి తరలివస్తున్నారని తెలిపారు.భక్తుల సంఖ్య దినదిన ప్రవర్ధమానంగా పెరుగుతున్న నేపథ్యంలో వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా, వాడపల్లిని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందుతున్నట్లు చెప్పారు.

**రూ.8 కోట్లతో ఏటిగట్టు రహదారి**

వాడపల్లి అభివృద్ధిలో భాగంగా భక్తుల రాకపోకలకు మరింత సౌకర్యవంతమైన రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరిన వెంటనే రూ.6 కోట్లను ఏటిగట్టు రోడ్డు నిర్మాణానికి మంజూరు చేశారని చెప్పారు.రావులపాలెం నుంచి ఏటిగట్టు మీదుగా వాడపల్లి వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మంజూరు చేసిన రూ.6 కోట్లతో పాటు రుడా నిధులు రూ.1 కోటి, పుష్కర నిధులు రూ.1 కోటి కలిపి మొత్తం రూ.8 కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు బండారు సత్యానందరావు వెల్లడించారు.

**అన్నదాన భవనానికి దాతల సహకారం**

నూతన వకుళమాత అన్నదాన భవనంలో సుమారు రూ.1.5 కోట్లతో ఆధునిక కిచెన్, భక్తులు కూర్చుని భోజనం చేసేందుకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసిన పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సమంతపూడి శ్రీరామరాజు, ఆయన బృందాన్ని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరో రూ.50 లక్షల సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చినందుకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వాడపల్లి ఆలయాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేసి, రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ఆలయ పాలకమండలి సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, ఆకుల రామకృష్ణ, కొత్తపేట జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, యాళ్ల దొరబాబు, తమలంపూడి రామకృష్ణారెడ్డి, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# జాహ్నవి మృతికి కారణం ఎవరు...









-రోడ్డుపై బైఠాయించిన తల్లిదండ్రులు,బంధువులు

-గురుకులంలో వైద్య నిర్లక్ష్యం

-తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదు

-వైద్యం ఆలస్యంపై కుటుంబం ఆరోపణ

**కూనవరం,ఆగస్టు 30. ప్రజా జ్యోతి** కూనవరం మండలం కోతులుగుట్టలోని ఏపీ టీడబ్ల్యూఆర్ గురుకుల కళాశాలలో 7వ తరగతి చదువుతున్న తెల్లం జాహ్నవి వైద్యం ఆలస్యం కావడంతో దుర్మరణం చెందిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. శనివారం రాత్రి 9:30 గంటలకు జాహ్నవికి తలనొప్పి,వాంతులు రావడంతో హాస్టల్ టీచర్ కోతులుగుట్ట సిహెచ్సి కి తీసుకెళ్లారు.ఏఎన్ఎంలు ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం తిరిగి హాస్టల్ కు తీసుకొచ్చారు. తెల్లవారేసరికి పరిస్థితి విషమించడంతో మళ్లీ ఆసుపత్రికి తీసుకొని వెళ్లారు.డాక్టర్ భద్రాచలం రిఫర్ చేయగా,భద్రాచలం ప్రైవేట్ హాస్పిటల్ నుండి ఖమ్మంకు రిఫర్ చేశారు.ఖమ్మం సమీపంలోకి వెళ్లేసరికి జాహ్నవి మరణించింది. జాహ్నవి తండ్రి తెల్లం రమేష్,తల్లి కుమారి మాట్లాడుతూ మా కూతురు అస్వస్థకు గురైనప్పుడు మాకు సమాచారం ఇవ్వలేదని గురుకుల అధికారులు,వైద్యుల నిర్లక్ష్యమే మా కూతురు మరణానికి కారణమని ఆరోపించారు.జాహ్నవి మృతదేహంతో పల్లూరు గ్రామంలో తల్లిదండ్రులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో వాహనాలు నిలిచిపోయాయి.సమాచారం అందుకున్న చింతూరు ఐటీడీఏ పీవో శుభం నోక్వల్ నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు, బంధువులతో రోడ్డుపై కూర్చొని కుటుంబాన్ని ఓదార్చారు. తల్లిదండ్రులతో పిఓ మాట్లాడుతూ ముగ్గురితో నిజ నిర్ధారణ కమిటీ వేసి నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.తక్షణ సాయం రూ.30 వేలు,కుటుంబంలో ఒకరికి ఉద్యోగం,5లక్షల పరిహారం పీవో హామీ ఇచ్చిన తర్వాత కుటుంబ సభ్యులు ధర్నా విరమించారు. తల్లిదండ్రుల ఆవేదన,బాధను చూసి గ్రామస్తులు తల్లడిల్లిపోయారు.

## కాంగ్రెస్ విఫల పాలనపై బీఆర్ఎస్ నిరసనలను విజయవంతం చేయాలి.. మాజీ మంత్రి పువ్వాడ పిలుపు



బీఆర్ఎస్ పార్టీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల తరఫున ప్రశ్నిస్తూ ఉద్యమిస్తుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పువ్వాడ వెల్లడించారు.కార్యనిర్వాహక ప్రభుత్వ సేవలను తెలుసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో, పరిపాలనలో పూర్తిగా విఫలమైందని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతోపాటు ప్రజలను చైతన్యపరిచేందుకు బీఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని అన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు.

## వైభవంగా మార్వాడీల కావడి యాత్ర.. హరిహర మహాదేవ' నామస్మరణతో సాగిన భక్తుల పాదయాత్ర



**కారేపల్లి, ఆగష్టు 30:** మార్వాడీల కావడి యాత్ర ఆదివారం వైభవంగా సాగింది. ఖమ్మం పట్టణంలోని రామ్‌దేవ్ బాబా మందిరం వద్ద ఉదయాన్నే ప్రారంభమైన ఈ యాత్ర ఎన్టీఆర్ సర్కిల్, ఖానాపురం, బల్లేపల్లి, రఘునాథపాలెం, మంచుకొండ, బూడిదంపాడు, పండితాపురం, ముచ్చర్ల, లింగాల, కారేపల్లి క్రాస్ రోడ్, సింగరేణి, అప్పాయిగూడెం, భాగ్యనగర్ తండా, ఆలియా తండాల మీదుగా ఇల్లెందు పట్టణంలోని రామ్‌దేవ్ బాబా ఆలయానికి చేరుకుంది. మార్వాడీ కుటుంబాలకు చెందిన వందలాది మంది భక్తులు కావడి యాత్రలో పాల్గొన్నారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో కుటుంబ బంధాలు బాగుండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు విస్తారంగా కురవాలని కోరుకుంటూ మార్వాడీలు కావడి యాత్ర చేపడతారు. భక్తులు కావడికి పవిత్ర జలాలను కట్టుకుని 'బోల్ బమ్', 'హరిహర మహాదేవ' నామస్మరణ చేస్తూ రామ్‌దేవ్ బాబా, శివాలయాలకు చేరుకున్నారు. యాత్రలో మహిళలు, చిన్నారులు, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కాలినడకన ఇల్లెందులోని ఆలయానికి చేరుకున్న భక్తులు పవిత్ర జలంతో అభిషేకాలు, పూజలు నిర్వహించి కావడి యాత్రను ముగించారు.

## కారేపల్లి శివాలయ అభివృద్ధికి బెల్ డీజీఎం శ్రీకారం



**కారేపల్లి :** ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న పురాతన శివాలయ అభివృద్ధికి ప్రముఖ బెల్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) గుగులోత్ రవి శ్రీకారం చుట్టారు. గర్భగుడికి ఆనుకుని ఉన్న మండపం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఆలయ నిర్వహణ కమిటీ ఈ విషయాన్ని రవి దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఆదివారం ఆలయాన్ని సందర్శించిన ఆయన.. మండప నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు 12 పిల్లర్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భీమవరపు శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ ఎర్ర నరసింహారావు, కమిటీ సభ్యుడు సూర్యదేవర వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు, ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## తాగునీటి కోసం రోడ్డెక్కిన ఎస్సీ కాలనీ వాసులు.. సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో



**దమ్మపేట రూరల్:** నెల రోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని మొద్దులగూడెం ఎస్సీ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. కాలనీలో తాగునీటి మోటార్ కాలిపోవడంతో దాన్ని బోరు నుంచి బయటకు తీసేందుకు ప్రయత్నించగా బోరులోనే ఇరుక్కుపోయిందని గ్రామస్తులు తెలిపారు. కొత్త బోరు వేస్తామని గ్రామ పంచాయతీ కార్యదర్శి చెప్పారని పేర్కొన్నారు. నెల రోజులుగా తాగునీటి కోసం సమీపంలోని పామాయిల్ తోటల్లోని డ్రిప్ పైపుల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని సీపీఎం దమ్మపేట మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. వర్షాలు పడినప్పుడు మోటార్లను ఆపివేస్తున్నారని, మోటార్లు పనిచేయని సమయంలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి 'ఇవాళ.. రేపు' అంటూ కాలం వెళ్లదీస్తున్నారని సీపీఎం జిల్లా నాయకుడు దొడ్డా లక్ష్మీనారాయణ అన్నారు. తక్షణమే తాగునీటి సరఫరాను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

# సెప్టెంబర్ 3న ఛలో విజయవాడ విజయవంతం చేయండి

**- యుటిఎఫ్ కడప జిల్లా శాఖ పిలుపు**



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 30 (ప్రజా జ్యోతి)** ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను రద్దు చేయాలని, అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ (23)1 సవరణకు కృషి చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 3 తేదీ చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం యుటిఎఫ్ భవన్ లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ నియమాలకాలకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ను తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం 2010లో విద్యాహక్కు చట్టాన్ని రూపొందించిందన్నారు. విద్యాహక్కు చట్టాన్ని ఆధారంగా తీసుకొని కేవలం ఉపాధ్యాయ నియమాకాలకే కాకుండా, పదోన్నతి పొందాలన్నా, సర్వీస్ లో కొనసాగాలన్నా టెట్ అర్హతను తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందని తెలిపారు. ఈ తీర్పు ప్రకారం 2010 కి ముందు ఉద్యోగ నియామకం పొందిన ఉపాధ్యాయులు సైతం టెట్ పరిధిలోకి వచ్చారన్నారు. తీర్పును పునః పరిశీలించాలని ఉపాధ్యాయ సంఘాలు, పలు రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసినప్పటికీ సుప్రీంకోర్టు వాటిని తిరస్కరించడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్ష మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణత సాధించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. టెట్ ఉత్తీర్ణత సాధించకపోతే ఉద్యోగం నుండి తొలగించాలనే తీర్పు ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనలకు గురి చేస్తున్నదన్నారు. సుప్రీంకోర్టు తీర్పును ఆసరాగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం 20 నుండి 30 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులను తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణత సాధించాలని నిబంధన విధించడం సహేతుకంగా లేదన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులలో అత్యధికులు 50 సంవత్సరాల వయసు పైబడిన వారేనని, ఒకవైపు విద్యా బోధన చేస్తూ, మరొకవైపు కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూ, వయసు రీత్యా పలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటూ టెట్ పరీక్షకు సన్నద్ధం కావడం కష్టతరంగా ఉందని వారు పేర్కొన్నారు. దీంతోపాటు పరీక్షల్లో ఇస్తున్న ప్రశ్నల స్థాయి, నోటిఫికేషన్ లో పేర్కొన్న సిలబస్ కంటే పై స్థాయిలో ప్రశ్నలు ఉండటం, బోధించే సబ్జెక్టుతో సంబంధంలేని సిలబస్ వంటి విధానాలు ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. 5 సంవత్సరాల లోపు పదవీ విరమణ పొందే వారికి టెట్ నుండి మినహాయింపు ఇచ్చినప్పటికీ వారు పదోన్నతి పొందాలంటే టెట్ ఉత్తీర్ణత సాధించాలని పేర్కొనడం ఆందోళన కలిగించే విషయమేనన్నారు. టెట్ ఉత్తీర్ణత సాధించలేకపోతే తమ భవిష్యత్తు ఏమవుతుందోనన్న తీవ్ర ఆందోళనతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారని వారు పేర్కొన్నారు. ఆందోళనతో కొనసాగుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం సాధ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల ఆందోళనను పరిగణలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యాహక్క చట్టం-2009 సెక్షన్ (23)1 చట్ట సవరణకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహణకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నప్పటికీ, స్పెషల్ టెట్ లో అర్హత మార్కులను తగ్గించాలని, ఆఫ్ లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని, సబ్జెక్టు ఉపాధ్యాయులకు సంబంధిత సబ్జెక్టులోనే పరీక్షలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోవడం వల్లనే సెప్టెంబర్ మూడవ తేదీ ఛలో విజయవాడ నిర్వహిస్తున్నామని పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎ.శ్రీనివాసులు, జి.గోపీనాథ్, ఎస్.ఎజాస్ అహ్మద్, ఎ.డిదేవదత్తం, ఆడిట్ కమిటీ జిల్లా కన్వీనర్ ఎం.ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.ప్రసన్న లక్ష్మి పెన్షనర్స్ ఫోరం నాయకులు శివ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అదుపు తప్పి ఆర్టీసీ బస్సు బోల్తా

**సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులు**

**పంచాయతీ,ఆర్ అండ్ బి అధికారులు నిర్లక్ష్యం**






**దువ్వూరు,ఆగస్టు30( ప్రజా జ్యోతి )** దువ్వూరు మండల కేంద్రంలో 'పల్లె వెలుగు' బస్సు బోల్తా పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది.ఆర్టీసీ బస్సు కండక్టర్ వివరాల మేరకు ఆళ్లగడ్డ డిపో ఏపీ21టీఏ4797 నెంబర్ గల బస్సు మైదుకూరు నుంచి దువ్వూరు సమీపంలో ఉన్న సివీవీ ఫంక్షన్ హాల్ సమీపానికి రాగానే, ఫంక్షన్ హాల్ లో జరుగుతున్న పెళ్లి వేడుకల్లో టపాసులు కాలుస్తూ ఉండడం వలన,ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనానికి తప్పించబోయి పంచాయతీ,ఆర్ అండ్ బి అధికారులు గతంలో మురికి నీరు పోవుటకు తీసిన కాలువలో అదుపు తప్పి 'పల్లె వెలుగు' బస్సు బోల్తా పడింది. ద్విచక్ర వాహనదారుడికి స్వల గాయాలు అయినట్టు సమాచారం. పంచాయతీ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు మురికి నీరు పోవుటకు తీసిన కాలువను పూడ్చి, రహదారి సూచికలు ఏర్పాటు చేయాలనీ మండల ప్రజలు, వాహనాదారులు కోరుతున్నాను.ఎటువంటి ప్రమాదాలు జరగ ముందే అధికారులు మేల్కొవాలని ప్రజలు కోరుచున్నారు. అలాగే దువ్వూరు బైపాస్ కు పోయే మార్గమధ్యలో ఉన్న ఫంక్షన్ హాలు పెళ్లిళ్ల జరిగే సమయంలో ఎక్కువ ట్రాఫిక్ ఉండడం, వాహనాలు రద్దీ పలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయి.ఘటన స్థలానికి చేరుకున్న దువ్వూరు ఎస్ఐ ధనుంజయుడు ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా బస్సు ను కాలువ నుంచి బయటికి తీశారు.ఫంక్షన్ హాల్స్ సమీపంలో ప్రమాదాలు, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## గోదావరి పుష్కరాలు-2027 నిర్వహణకు ప్రజాభవన్‌లో

# ప్రత్యేక అధికారి కార్యాలయం ప్రారంభం

**వరంగల్ :** ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, స్థానిక సంస్థలు, దేవాదాయ శాఖల మధ్య సమన్వయానికి ప్రత్యేక అధికారి కార్యాలయం సమన్వయ కేంద్రంగా పనిచేస్తుందని తెలిపిన మంత్రి గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ, తెలంగాణ అంటే గోదావరి పుష్కరాలు అనేలా వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నిర్వహణ వుండాలన్న మంత్రి సురేఖ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనలు, సలహాల మేరకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో గోదావరి పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా పనులను చేపడుతున్నట్లు స్పష్టంచేసిన మంత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ, తెలంగాణ అంటే గోదావరి పుష్కరాలు అనేలా దేశం నలుమూలలా తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పే విధంగా గోదావరి పుష్కరాల ఏర్పాట్లు వుండాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ అన్నారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు తెలంగాణ ఆతిథ్యం, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనం ప్రతిబింబించేలా వసతుల కల్పన వుండాలని మంత్రి సురేఖ అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రంలో వచ్చే ఏడాది జూన్ 26 నుంచి నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లను సమర్థవంతంగా సమన్వయం చేసేందుకు ప్రజాభవన్ లోని రెండవ అంతస్తులో ఏర్పాటు చేసిన స్పెషల్ ఆఫీసర్ (ప్రత్యేక అధికారి) కార్యాలయాన్ని ఈ రోజు మంత్రి శ్రీమతి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. కార్యాలయంలోని సెక్షన్లను దేవాదాయ శాఖ అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. తర్వాత ప్రత్యేకాధికారి కార్యాలయంలోని నూతన కాన్ఫరెన్స్ హాలులో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డైరక్టర్ హనుమంతరావు, ఆర్జేసి రామకృష్ణారావు, డిసి కృష్ణ ప్రసాద్, పలువురు దేవాదాయ శాఖ అధికారులు, ఉద్యోగులు, ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్ లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, గోదావరి పుష్కరాలు అనగానే ఇప్పటివరకు రాజమహేంద్రవరం పేరు ప్రధానంగా వినిపించేదని, వచ్చే గోదావరి పుష్కరాల నిర్వహణతో తెలంగాణ తన ప్రత్యేకతను చాటుకుని, పుష్కరాలు అంటే తెలంగాణ అనే స్థాయిలో మన రాష్ట్రానికి ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాల నిర్వహణలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, స్థానిక సంస్థలు, దేవాదాయ శాఖల మధ్య సమన్వయానికి ప్రత్యేక అధికారి కార్యాలయం కేంద్ర బిందువుగా పనిచేస్తుందని మంత్రి సురేఖ తెలిపారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌలిక వసతుల కల్పన, ఘాట్ల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై ప్రత్యేక అధికారి కార్యాలయం కీలక సమన్వయ కేంద్రంగా పనిచేయడంతో పాటు, పుష్కరాల నిర్వహణకు సంబంధించిన పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించడానికి వీలవుతుందని మంత్రి స్పష్టం చేశారు.

వచ్చే సంవత్సరం 26 జూన్ నుంచి 7 జూలై వరకు నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను భక్తులకు గొప్ప ఆధ్యాత్మిక అనుభూతినిచ్చే సురక్షితమైన, సౌకర్యవంతమైన పుష్కర యాత్రగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేపడుతున్నదని మంత్రి కొండా సురేఖ తెలిపారు. గోదావరి పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు సీఎం రేవంత్ రెడ్డిగారు రూ.1000 కోట్ల నిధులను మంజూరు చేయడం హర్షణీయమని అన్నారు. సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను ఎంతో వైభవంగా నిర్వహించినట్లే, గోదావరి పుష్కరాలను నిర్వహిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక సమ్మక్క-సారక్క జాతరను రెండుసార్లు విజయవంతంగా చేపట్టినట్లు గుర్తు చేశారు.

ఈ సందర్భంగా అధికారులు గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను మంత్రి కొండా సురేఖ గారికి వివరించారు. గోదావరి పరిహాక ప్రాంతంలో ఎంచుకున్న ప్రాంతాల్లో ఇప్పటికే ఘాట్ల నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు డైరక్టర్ హనుమంతరావు మంత్రి గారికి వివరించారు. టైర్--1, టైర్--2 పరిధిలో సుమారు 2 కి.మీ మేర ఘాట్‌ల నిర్మాణ పనులు ప్రారంభించగా, మొత్తంగా టైర్ 1, 2, 3 పరిధిలో 5 కి.మీకి పైగా ఘాట్‌లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. నిధుల వివరాల పై మంత్రి సురేఖ అధికారులను ఆరా తీయగా, అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఆర్ అండ్ బి, పంచాయత్ రాజ్ శాఖలకు నిధులు విడుదలైనట్లు అధికారులు తెలిపారు. అలాగే మెడికల్, పోలీస్, టూరిజం శాఖలకు నిధులు మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. దశలవారీగా టెండర్ల నిర్వహణ, నిధుల మంజూరీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు ఘాట్ల నమూనా చిత్రాలను అధికారులు మంత్రి సురేఖ గారు పరిశీలించారు.

గోదావరి నది పరివాహక ప్రాంతం తెలంగాణలో ఎక్కువగా వున్నందున గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పాత ఘాట్లను పటిష్టం చేస్తూ, కొత్త ఘాట్లను మళ్ళీ వచ్చే పుష్కరాల వరకు మనగలిగేలా పటిష్టంగా నిర్మించాలని మంత్రి సురేఖ అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు.

నేపాల్ భీకర వరదల్లోనూ కొట్టుకుపోకుండా స్థిరంగా నిలిచిన ఇంటిని ప్రస్తావించిన మంత్రి

ఇటీవల నేపాల్‌లో వచ్చిన భారీ వరదల్లో చుట్టుపక్కల ఎన్నో నిర్మాణాలు కొట్టుకుపోయినా, ఒక ఇల్లు మాత్రం చెక్కుచెదరకుండా నిలిచిన తీరును మంత్రి సురేఖ ఈ సందర్భంగా ప్రస్తావించారు. నాణ్యతకు గొప్ప ఉదాహరణగా ఆ ఇల్లు నిలుస్తుందన్నారు. గోదావరి పుష్కరాల పనులు విషయంలో హడావుడిగా కాకుండా నాణ్యతకు, పటిష్టతకు ప్రాధాన్యత ఇవ్వాలని కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు. గోదావరి పుష్కరాల కోసం చేపట్టే ప్రతి నిర్మాణాన్ని రాజీ పడకుండా నాణ్యతతో చేపట్టాలని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. పుష్కరాల కోసం చేసే ఏర్పాట్లను తాత్కాలికమైనవిగా భావించకుండా, భవిష్యత్ కార్యక్రమాలను వుపయోగపడేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

"గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధి పనులతో పాటు గోదావరి పుష్కర ఏర్పాట్లు కూడా భవిష్యత్ తరాలు సైతం కీర్తించేలా ఉండాలి. మన ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడుతూ, దేవాలయాల ప్రాచీన వైభవానికి మరింత వన్నె తెచ్చేలా, నాణ్యతతో కూడిన శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలి" అని మంత్రి సురేఖ సూచించారు. భక్తులు స్నానాలు చేసే ఘాట్లలో నీటి ప్రవాహ ఉధృతి ఎక్కువగా వుంటే కొట్టుకుపోయే పరిస్థితులున్నందున గ్రిల్స్ ను పటిష్టంగా ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మహిళలు బట్టలు మార్చుకునేందుకు అవసరమైన సౌకర్యాలను పకడ్బందీగా చేపట్టాలని ప్రత్యేకంగా నిర్దేశించారు.

## కూలర్‌ను పక్కకు జరుపుతుండగా కరెంట్ షాక్.. యువకుడు మృతి



**దస్తురాబాద్ :** విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన ఎంబాడి సతీష్ (27) ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు. వ్యవసాయ కూలీగా పనిచేస్తున్న సతీష్ శనివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఇంట్లో ఉన్న ఇనుప ఎలక్ట్రిక్ కూలర్‌ను పక్కకు జరిపే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే దస్తురాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి భీమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## సూర్యాపేటలో ఘనంగా ఇంద్రవెల్లి ముత్యాలమ్మ బోనాలు.. అమ్మవారిని దర్శించుకున్న జగదీశ్ రెడ్డి



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తాళ్లగడ్డలో శ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. బోనాల పండుగను పురస్కరించుకొని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ముందస్తుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, గౌడ పెద్దలు, పూజారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించిన అనంతరం శాలువాతో సత్కరించారు.

## ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు.. ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలు

నల్లగొండ జిల్లా చెర్వుగట్టు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లారీని ఢీకొన్న అనంతరం కారు సుమారు 200 మీటర్లు వెనక్కి వెళ్లినట్లు సమాచారం. ప్రమాదంలో గాయపడిన వారికి నర్కెట్‌పల్లి అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## నీట్ పీజీ-2026 పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ :** నర్సంపేటలోని బిట్స్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ--2026 పరీక్షను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తనిఖీ చేశారు. ఈ తనిఖి లో జిల్లా కలెక్టర్ వెంట డియార్వో విజయలక్ష్మి , నర్సంపేట ఆర్డీవో ఉమారాణి సెక్షన్ సూపరెండెంట్ రంజిత్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, పరీక్ష నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ రోజు నిర్వహించిన నీట్ పీజీ--2026 పరీక్షకు మొత్తం 132 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 127 మంది హాజరయ్యారని జిల్లా కలెక్టర్ తెలిపారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## చింతల్‌లో శ్రీ భక్త హనుమాన్ దేవస్థానంలో ప్రతిష్ఠాపన మహోత్సవం



**వరంగల్ :** ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు వరంగల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారు వరంగల్ తూర్పు నియోజకవర్గం చింతల్‌లోని శ్రీ భక్త హనుమాన్ దేవస్థానంలో నవగ్రహ, ధ్వజస్తంభం, ఆలయ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు వరంగల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శ్రీ ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారు ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారు మాట్లాడుతూ.. శ్రీ భక్త హనుమాన్ స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ మహోత్సవంలో మండల శ్రీకాంత్, మర్రి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు వీర ప్రతాప్, సుగుణకర్ రావు, కేవీకే రాజు,చంద్రశేఖర్, మధు, సమ్మలు, శ్రీధర్, గోపి, సాగర్, అర్చకులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## బిజినెస్

### త్వరలో అంతర్జాతీయ మార్కెట్లోకి లలితా జువెలరీ

**దక్షిణాది రాష్ట్రాల్లో కొత్తగా 110 స్టోర్లు**



తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) పూర్తి చేసుకున్న ఆభరణాల విక్రయ సంస్థ లలితా జువెలరీ మార్ట్ లిమిటెడ్ వ్యాపార విస్తరణపై పూర్తి స్పష్టతతో ముందుకు సాగుతోందని సంస్థ సీఎండీ ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. శనివారమిక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల్లో రిటెయిల్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించడంతోపాటు, అంతర్జాతీయ మార్కెట్లోకి ప్రవేశించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం తమకు 64 షోరూములున్నాయని, వీటికి అదనంగా మరో 110 కేంద్రాలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. 2027 మార్చి నాటికి కనీసం 10 స్టోర్లకు పైగా ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. దక్షిణాదిలో 175 షోరూములకు చేరుకోగానే ఉత్తర భారత్‌కు విస్తరిస్తామని వెల్లడించారు. ఇందులో తొలుత మహారాష్ట్ర, ఆ తర్వాత ఉత్తరప్రదేశ్, ఢిల్లీ మార్కెట్లు ఉంటాయన్నారు.

**మలేషియా, సింగపూర్‌లో..:** వచ్చే 2-3 నెలల్లో మలేషియాలో షోరూమును ప్రారంభించబోతున్నట్లు కిరణ్ కుమార్ వెల్లడించారు. ఆ తర్వాత సింగపూర్ మార్కెట్లోకి అడుగుపెడతామని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఉన్న భారతీయ, ఆసియా వినియోగదారులకు నాణ్యమైన ఆభరణాలను, అత్యుత్తమ ధరకే అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు.

**విక్రయాలు పెంచుకుంటూ...:** అధిక లాభాలు ఆశించకుండా, తక్కువ లాభంతో ఎక్కువ విక్రయాలు సాధించడమే సంస్థ ప్రధాన వ్యూహమని ఆయన వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో 58 షోరూముల ద్వారా రూ.25,000 కోట్ల మొత్తం ఆదాయం, రూ.1,000 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో స్టోర్ల సంఖ్య పెరిగిన కొద్దీ విక్రయాల విలువ మరింత వృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమకు 9 లేదా 14 క్యారెట్ల బంగారం విక్రయించే ఆలోచన లేదని ఆయన స్పష్టం చేశారు. 22 క్యారెట్ల పసిడి ఆభరణాలనే విక్రయిస్తామన్నారు. తమ వద్దకు వస్తున్నవారిలో 60% పాత బంగారం మార్పిడి చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

**పసిడి ధరలపై..:** 'నేను వ్యాపారం మొదలుపెట్టినప్పుడు గ్రాము రూ.280 ఉండేది. కరోనా సమయంలో కిలో బంగారం రూ.48 లక్షలకు చేరింది. ఇప్పుడు దాదాపు రూ.1.63 కోట్ల దరిదాపుల్లో ఉంది. బంగారం ధర ఎప్పుడూ వృద్ధి దశలోనే ఉంటుంది. కాబట్టి, పసిడిని అత్యంత సురక్షితమైన సాధనంగా చూడాల'ని ఆయన సూచించారు.

# మరింత మందికి ఈపీఎఫ్..
# అక్టోబర్ 31 వరకు 'ప్రత్యేక' ఛాన్స్




ప్రైవేటు రంగ ఉద్యోగులకు ఉపయోగపడే కీలక నిర్ణయాన్ని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ తీసుకుంది. ఇంతకాలం అర్హత ఉన్నప్పటికీ ఈపీఎఫ్ పరిధిలోకి రాని ఉద్యోగులను నమోదు చేసేందుకు 'ఎంప్లాయీస్ ఎన్‌రోల్‌మెంట్ క్యాంపెయిన్ 2026'ను ప్రారంభించింది. గతంలో మిగిలిపోయిన నమోదు, కాంప్లయన్స్ లోపాలను సరిదిద్దడంతోపాటు మరింత మంది ఉద్యోగులకు పీఎఫ్, పెన్షన్, బీమా వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

**అక్టోబర్ 31 వరకు అవకాశం**

కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ 2026 జూన్ 29న జుజుజ-2026ను నోటిఫై చేసింది. ఈ ప్రత్యేక ప్రచారం జూలై 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఉద్యోగుల నమోదు కోసం అక్టోబర్ 31 వరకు అవకాశం ఉంది. వివిధ సంస్థల్లో 2009 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 మధ్య కాలంలో పనిచేసినా, అర్హత ఉన్నప్పటికీ గతంలో జూఖీలో నమోదు కాని ఉద్యోగులను ఈ పథకం కింద చేర్చవచ్చు. అయితే డిక్లరేషన్ సమయంలో సంబంధిత ఉద్యోగి అదే సంస్థలో ఉద్యోగంలో కొనసాగుతూ ఉండాలి.

**యజమానులకు ప్రత్యేక వెసులుబాటు**

గతంలో ఉద్యోగుల నుంచి పీఎఫ్ వాటా మినహాయించకపోయిన సందర్భాల్లో, జుజుజ-2026 కింద ప్రకటించిన ఉద్యోగులకు ఉద్యోగి వాటా చెల్లింపు నుంచి మినహాయింపు కల్పించారు. అయితే యజమాని తన వాటాతోపాటు వర్తించే వడ్డీ, అడ్మినిస్ట్రేటివ్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా విధించే నష్టపరిహారానికి బదులుగా ఈ ప్రచారం కింద ఒక్కో సంస్థకు రూ.100 లంప్‌సమ్ డ్యామేజెస్ నిబంధనను తీసుకొచ్చారు.

**ఎవరికి వర్తిస్తుంది?**

ఈ ప్రచారం ప్రధానంగా గతంలో ఈపీఎఫ్ కవరేజీకి దూరమైన అర్హత కలిగిన ఉద్యోగుల కోసం ఉద్దేశించినది. ఈపీఎఫ్ పరిధిలో ఉన్న లేదా ఈపీఎఫ్ చట్టం/సామాజిక భద్రతా కోడ్ కింద కవరేజీకి వచ్చే సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. యజమానులు తమ పాత ఉద్యోగ, వేతన రికార్డులను పరిశీలించి అర్హులైన ఉద్యోగులు ఎవరైనా నమోదు కాకుండా మిగిలిపోయారా అనేది గుర్తించాలని ఈపీఎఫ్‌వో సూచించింది.

**ఆన్‌లైన్‌లోనే నమోదు**

జుజుజ-2026 కింద నమోదు ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. ప్రకటించిన ఉద్యోగులకు ఉమాంగ్ యాప్ ద్వారా ఫేస్ అథెంటికేషన్ ఆధారంగా ఖాూచీ జనరేషన్, అనంతరం జుజ= ద్వారా సంబంధిత పీఎఫ్ కాంట్రిబ్యూషన్ల చెల్లింపు వంటి విధానాలను ఈపీఎఫ్‌వో పేర్కొంది. దీంతో గతంలో నమోదు కాని ఉద్యోగులను అధికారిక సామాజిక భద్రతా వ్యవస్థలోకి తీసుకురావడంతోపాటు రికార్డుల్లో పారదర్శకత పెరగనుంది.

**ఉద్యోగులకు ప్రయోజనం ఏంటి?**

ఈపీఎఫ్‌లో నమోదు కావడం ద్వారా అర్హత కలిగిన ఉద్యోగులకు భవిష్య నిధి మాత్రమే కాకుండా సంబంధిత పెన్షన్, ఉద్యోగి డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు అందుబాటులోకి వస్తాయి. అదే సమయంలో సంస్థల గత కాంప్లయన్స్ లోపాలను క్రమబద్ధీకరించేందుకు కూడా ఈ ప్రత్యేక విండో ఉపయోగపడుతుంది.

# సెప్టెంబర్ నెలలో 14 రోజుల పాటు బ్యాంకులు బంద్..

బ్యాంకింగ్ ఖాతాదారులకు బిగ్ అలర్ట్. ఆగస్ట్ నెల ముగిసి సెప్టెంబర్ నెల రాబోతుంది. దీంతో బ్యాంక్ సెలవులు కూడా మారుతున్నాయి. కొత్త నెలలో బ్యాంకులు ఏయే రోజుల్లో మూతపడతాయనేది తెలుసుకోవడం ముఖ్యం. దీని వల్ల ముందుగానే బ్యాంక్ లావాదేవీలను ప్లాన్ చేసుకోవచ్చు. సెప్టెంబర్‌లో తమ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బ్యాంక్ సంఘాలు సమ్మెకు దిగుతున్నాయి. ఈ మేరకు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాక్ యూనియన్స్ సమ్మెకు పిలుపునిచ్చింది. సెప్టెంబర్ 11న దేశవ్యాప్తంగా సమ్మెకు దిగుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఐదు రోజుల వర్కింగ్ డేస్ అమలు చేయడంతో పెన్షన్లలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళనలు చేపట్టనున్నారు. దీంతో ఆ రోజు కూడా బ్యాంకులు మూతపడే అవకాశముంది. ఇక సెప్టెంబర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి, వినాయక చవితి లాంటి అనేక పండుగలు వచ్చాయి. ఈ కారణంతో బ్యాంకులు ఎక్కువ రోజుల పాటు మూతపడనున్నాయి.

**సెప్టెంబర్‌లో బ్యాంక్ సెలవులు ఇవే..**

-సెప్టెంబర్ 4న శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో బ్యాంకులు మూతపడనున్నాయి. ఏపీ, తెలంగాణలో కూడా బంద్ కానున్నాయిః

-సెప్టెంబర్ 6న ఆదివారం సందర్భంగా సాధారణ సెలవు

సెప్టెంబర్ 11న బ్యాంక్ ఉద్యోగుల సమ్మె కారణంగా బ్యాంక్ సేవల్లో అంతరాయం

-సెప్టెంబర్ 12న రెండో శనివారం కావడంతో బ్యాంకులు ఉండవు

-సెప్టెంబర్ 13న ఆదివారం బ్యాంకులు పనిచేయవు

-సెప్టెంబర్ 14న వినాయక చవితి సందర్భంగా బ్యాంకులకు సెలవు దినం

-సెప్టెంబర్ 15న గణేశ్ చతుర్థి రెండో రోజు సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో బ్యాంకులు ఉండవు

-సెప్టెంబర్ 20న ఆదివారం రోజున బ్యాంకులకు సాధారణ సెలవు

-సెప్టెంబర్ 21న సోమవారం శ్రీమంత శంకర్ దేవ్ జన్మదినం సందర్భంగా భువనేశ్వర్, తిరువనంతపురంలో బ్యాంకులు బంద్ అవుతాయి

-సెప్టెంబర్ 26 నాలుగో శనివారం సందర్భంగా బ్యాంకులు బంద్

-సెప్టెంబర్ 27 ఆదివారం బ్యాంకులు ఉండవు




**బ్యాంక్ సెలవుల్లో మార్పులు**

అయితే బ్యాంక్ సెలవులు అనేది రాష్ట్రం, ప్రాంతాన్ని బట్టి మారుతూ ఉంటాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పండుగలు ఉంటాయి. దీంతో ఒక ప్రాంతంలో సెలవు ఉంటే.. మరొక ప్రాంతంలో సెలవు వర్తించదు. దీంతో మీరు బ్యాంక్‌కు వెళ్లాలనుకున్నప్పుడు ఒకసారి బ్రాంచ్ సిబ్బందిని సంప్రదించి కన్ఫార్మేషన్ తీసుకోవడం మంచిది. అయితే బ్యాంకులు మూతపడితే కేవలం బ్యాంక్ సంబంధిత కార్యకలాపాలు మాత్రమే నిలిచిపోతాయి. యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా యథావిధిగా కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చు. కేవలం చెక్కుల క్లియరెన్స్ సేవలు వంటి నిలిచిపోతాయని చెప్పవచ్చు.

# లార్డ్స్‌లో అబ్బాస్ పాంచ్ పటాకా..
# పాకిస్థాన్ బ్యాటర్లు అద్భుతం చేసేనా..!




లార్డ్స్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ ఆలౌటైంది. పాకిస్థాన్ పేసర్ మొహమ్మద్ అబ్బాస్(5-57) ఐదు వికెట్లతో చెలరేగగా.. ఆతిథ్య జట్టు నాలుగోరోజు తొలి సెషన్‌లోనే కుప్పకూలింది. డాన్ లారెన్స్(54) అర్ధ శతకంతో, హ్యారీ బ్రూక్(34) మాత్రమే రాణించారు. పాకిస్థాన్‌కు 389 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన జో రూట్ సేన.. సిరీస్‌ను వైట్‌వాష్ చేయాలనే పట్టుదలతో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో చేతులెత్తేసిన పాక్ బ్యాటర్లు.. పటిష్టమైన పేస్ దళాన్ని ఎదుర్కొని ఓటమిని తప్పిస్తారా? అనేది ఆసక్తి రేపుతోంది. రసవత్తరంగా సాగుతున్న లార్డ్స్ టెస్టులో ఇంగ్లండ్ ఆలౌటైంది. నాలుగో రోజు జహీర్ అబ్బాస్(5-57) విజృంభణతో లోయర్ ఆర్డర్ తోకముడవగా ఆతిథ్య జట్టు 208 పరుగులకే ఆలౌటైంది. ఓలీ రాబిన్సన్(8)ను పెవిలియన్ పంపిన అబ్బాస్ లార్డ్స్‌లో ఐదువికెట్ల ప్రదర్శన చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగుల ఆధిక్యంతో ఆట కొనసాగించిన ఇంగ్లండ్‌ను పాక్ పేసర్లు అద్భుతంగా కట్టడి చేశారు. అబ్బాస్, ఖుర్రం, మొహమ్మద్ అలీ()లు వరసగా వికెట్లు తీసి పాక్‌ను పోటీలోకి తెచ్చారు. అయితే.. హ్యారీ బ్రూక్(34), డాన్ లారెన్స్(54)లు పట్టుదలగా ఆడారు. పునరాగమనం సిరీస్‌లో ఆకట్టుకున్న లారెన్స్ అర్ధ శతకంతో ఇంగ్లండ్ ఆధిక్యాన్ని పెంచుతూ పోయాడు. క్రీజులో పాతుకుపోయిన అతడిని బౌల్డ్ చేసిన అబ్బాస్ ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. చివరి బ్యాటరైన ఓలీ రాబిన్సన్(8) వికెట్టూ తీసి.. లార్డ్స్‌తో చిరస్మరణీయ ప్రదర్శనతో రికార్డు సాధించాడీ పాక్ పేసర్. 389 పరుగుల ఛేదనలో పాక్ బ్యాటర్లు నిలబడడంపై ఆ జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి

## కౌంటీల్లో భారత పేస్ అస్త్రం..
## స్వదేశానికి తిరిగి వచ్చేది అప్పుడే..!




రంజీ ట్రోఫీలో సంచలన ప్రదర్శనతో భారత జెర్సీ ధరించిన అకీబ్ నబీ విదేశాల్లో సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. టెస్టుల్లో మరింత బౌలింగ్ అనుభవం కోసం ఇంగ్లండ్‌కు వెళ్లిన అతడు అక్కడ కౌంటీ ఛాంపియన్‌షిప్ లో ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. మూడు కౌంటీ మ్యాచుల్లో ఆడనున్న ఈ స్పీడ్‌స్టర్.. సర్రే జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. అనంతరం.. సెప్టెంబర్‌లో మూడో వారంలో నబీ స్వదేశానికి తిరిగి రానున్నాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్(ఔజ 2025-27)లో కీలకమైన న్యూజిలాండ్ పర్యటనలో యువ పేసర్ అకీబ్ నబీని అస్త్రంగా ప్రయోగించాలనుకుంటోంది భారత జట్టు. అందుకని.. కివీస్ సిరీస్‌ను దృష్టిలో పెట్టుకొని అతడిని ఇంగ్లండ్‌లో కౌంటీలు ఆడేందుకు పంపింది బీసీసీఐ. టెస్టు బౌలర్‌గా నబీ మరింత రాటుదేలడం కోసం, ఇంగ్లండ్ పరిస్థితుల్లో అతడి స్వింగ్ నైపుణ్యాన్ని పరీక్షించడం కోసం ఈ నిర్ణయం తీసుకుంది బీసీసీఐ.

**సెప్టెంబర్ 2న అరంగేట్రం**

దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీలో నార్త్ జోన్ స్క్వాడ్ నుంచి వైదొలిగిన నబీ.. యూకే వీసాతో ఇంగ్లండ్ చేరుకున్నాడు. అక్కడ సర్రే జట్టు తరఫున మూడు కౌంటీ మ్యాచ్‌లు ఆడనున్నాడీ బారాముల్లా ఎక్స్‌ప్రెస్. సెప్టెంబర్ 2వ తేదీన యార్క్‌షైర్ జట్టును సర్రే ఢీకొట్టనుంది. ఈ మ్యాచ్‌తో కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో నబీ అరంగేట్రం చేయనున్నాడు. అనంతరం సెప్టెంబర్ 8న సస్సెక్స్ జట్టుతో, సెప్టెంబర్ 15న గ్లమోర్గాన్ జట్టుతో సర్రే తలపడనుంది. ఈ మూడు మ్యాచులు పూర్తయ్యాక పుదుచ్చేరిలో సెప్టెంబర్ 22న ఆస్ట్రేలియా ఏతో మ్యాచ్ కోసం నబీ భారత్‌కు రానున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 43 మ్యాచుల్లోనే 162 వికెట్లు తీసిన ఈ పేస్‌గన్.. రాబోయే రోజుల్లో టీమిండియా బౌలింగ్ దళంలో కీలకం కానున్నాడు.

## స్పోర్ట్స్

### 15 ఏళ్లకే కెప్టెన్సీ..
### ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన వైభవ్..!



పదిహేనేళ్లకే అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన వైభవ్ సూర్యవంశీ మరో ఘనత సాధించాడు. అత్యంత పిన్నవయస్కుడిగా పలు రికార్డులు నెలకొల్పిన వైభవ్.. ఈసారి కెప్టెన్సీ చేపట్టాడు. దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీ లో ఈస్ట్ జోన్ వైస్ కెప్టెన్‌గా ఎంపికైన ఈ కుర్రాడు.. సెమీఫైనల్లో సారథిగా వ్యవహరించాడు. కెప్టెన్ ఇషాన్ కిషన్ గాయపడడంతో.. డిప్యూటీ అయిన వైభవ్ ఈస్ట్ జోన్ పగ్గాలు అందుకున్నాడు. తద్వారా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అతి చిన్నవయస్కుడైన సారథిగా చరిత్ర సృష్టించాడీ డాషింగ్ ఓపెనర్. విధ్వంసక ఆటకు కేరాఫైన వైభవ్ పదిహేనేళ్లకే కెప్టెన్‌గా జట్టును నడిపించాడు. 2024లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన వైభవ్.. రెండేళ్లకే సారథిగా అవకాశం దక్కించుకున్నాడు. దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ వైస్ కెప్టెన్‌గా ఉన్న అతడు.. ఆదివారం సౌత్ జోన్‌తో సెమీఫైనల్ మ్యాచ్‌లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. కెప్టెన్ ఇషాన్ కిషన్ చేతికి గాయమవ్వడంతో అతడు మైదానం వీడగా.. వైభవ్ బాధ్యతలు తీసుకున్నాడు. తనకంటే రెండింతలు వయసులో పెద్దవారైనా మహమ్మద్ షమీ, అభిమన్యు ఈశ్వరన్, ముకేశ్ కుమార్‌లకు 15 ఏళ్ల వైభవ్ నాయకత్వం వహించడం విశేషం.

**రివ్యూ హిట్టే..**

మొదటిసారి దులీప్ ట్రోఫీ ఆడుతున్న వైభవ్ నాయకుడిగా తొలి మ్యాచ్‌లోనే బౌలింగ్, ఫీల్డింగ్ మార్పులతో ఆకట్టుకున్నాడు. ముకేష్ కుమార్ ఓవర్లో ఆర్యన్ జుయల్ ఆడిన బంతి..ఎడ్జ్ తీసుకోగా వికెట్ ఒడుపుగా అందుకున్నాడు. అయితే.. అంపైర్ నాటౌట్ ఇవ్వగా.. తటపటాయిస్తూనే రివ్యూ తీసుకొని విజయవంతమయ్యాడు వైభవ్. దాంతో, తొలి రోజే సెంట్రల్ జోన్ జట్టు 266 పరుగులకే ఆలౌటైంది. రింకూ సింగ్(60), అర్యన్ జుయల్(46)లు మాత్రమే పర్వాలేదనిపించారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో అభిజిత్(3-38), ముకేశ్ కుమార్(3-56)లు మూడేసి వికెట్లు తీయగా.. షమీ, ఖురేషిలు రెండేసి వికెట్లతో రాణించారు. ఐపీఎల్‌లో రికార్డు శతకాలతో జాతీయ జట్టులోకి వచ్చిన వైభవ్ జింబాబ్వే పర్యటనలో మెరిశాడు. ఇప్పుడు దేశవాళీలోనూ అదరగొడుతున్నాడీ కుర్ర సంచలనం. ప్రతిసారి తుఫాన్ ఇన్నింగ్స్‌లతో వార్తల్లో నిలిచే వైభవ్ ఈసారి బంతితో మ్యాజిక్ చేశాడు. ఎడమ చేతివాటం స్పిన్నరైన అతడు.. నార్త్ ఈస్ట్ జోన్‌పై నాలుగు బంతుల్లోనే రెండు వికెట్లతో ఔరా అనిపించాడు. బ్యాటుతో 8 పరుగులే చేసినా ఆ రెండు వికెట్లతో ఈస్ట్ జోన్ సెమీస్ చేరడంలో తనవంతు పాత్ర పోషించిన అతడు.. తాను బౌలింగ్ చేస్తాననే విషయం కెప్టెన్ ఇషాన్ కిషన్‌కు తెలియదని చెప్పాడు. నార్త్ ఈస్ట్ జోన్ జట్టుపై నాలుగు బంతుల్లోనే 2 వికెట్లు తీసి ఆశ్చర్యపరిచాడు. తమ జట్టు సెమీస్ చేరడంలో కీలకమైన అతడు 'నేనూ వికెట్లు తీయగలను అని మా కెప్టెన్ ఇషాన్ కిషన్‌కు తెలియదు' అని పేర్కొన్నాడీ యువ సంచలనం. ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ ఇన్నింగ్స్ 210 పరుగులతో గెలుపొంది సెమీస్‌కు దూసుకెళ్లింది.



## యష్ 'టాక్సిక్' సునామీ.. ట్రోలింగ్ ఎఫెక్ట్ ఉన్నా.. 4 రోజుల్లో రూ. 254 కోట్లు!

రాకింగ్ స్టార్ యష్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'టాక్సిక్: ఎ ఫెయిరీ టెల్ ఫర్ గ్రోన్-అప్స్' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. సినిమాలోని హింసాత్మక సన్నివేశాలు, రొమాంటిక్ ట్రాక్స్ మరియు మహిళలను చూపించిన విధానంపై సోషల్ మీడియాలో విమర్శలు, ట్రోలింగ్ వస్తున్నప్పటికీ కలెక్షన్లపై మాత్రం ఎలాంటి ప్రభావం పడలేదు. విడుదలైన కేవలం 4 రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 254.75 కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టి సంచలనం సృష్టిస్తోంది. తాజా నివేదిక ప్రకారం ఈ సినిమా నాల్గవ రోజు దేశవ్యాప్తంగా సుమారు రూ. 24.50 కోట్ల నెట్ కలెక్షన్లను సాధించింది. దీంతో భారత్‌లో నాలుగు రోజుల మొత్తం నెట్ కలెక్షన్లు రూ. 190.45 కోట్లకు చేరగా, ఇండియా గ్రాస్ కలెక్షన్లు రూ. 227.50 కోట్లకు చేరుకున్నాయి. శుక్రవారంతో పోలిస్తే శనివారం దేశీయ వసూళ్లలో సుమారు 9.9 శాతం స్వల్ప తగ్గుదల కనిపించినప్పటికీ, వీకెండ్ కావడంతో వసూళ్లు పటిష్టంగానే సాగాయి. ఇక ఓవర్సీస్‌లో శనివారం రూ. 4 కోట్లు రాబట్టడంతో, విదేశీ గడ్డపై మొత్తం కలెక్షన్లు రూ. 27.25 కోట్లకు తాకాయి. కాగా, ఆగస్టు 26న కన్నడ, హిందీ, తమిళం, తెలుగు, మలయాళం మరియు ఇంగ్లీష్ భాషల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రంలో హుమా ఖురేషి, రుక్మిణి వసంత్, తారా సుతారియా, నయనతార మరియు కియారా అద్వానీ కీలక పాత్రల్లో నటించారు.

## బాలయ్య -- కొరటాల సినిమాలో కోలీవుడ్ స్టార్ హీరో.!

టాలీవుడ్ ఇండస్ట్రీలో ప్రస్తుతం చర్చ జరుగుతున్న కాంబినేషన్ నందమూరి బాలకృష్ణ మరియు మాస్ డైరెక్టర్ కొరటాల శివ కలయిక. 'దేవర' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న కొరటాల శివ, తన తదుపరి ప్రాజెక్ట్‌ను నందమూరి బాలకృష్ణ హీరోగా తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాత సుధాకర్ చెరుకూరి భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. తాజాగా ఈ సినిమా గురించి ఫిల్మ్ నగర్ వర్గాల్లో వినిపిస్తున్న కొన్ని వార్తలు అటు నందమూరి అభిమానుల్లో, ఇటు సినీ వర్గాలలో విపరీతమైన అంచనాలను పెంచేస్తున్నాయి. ఈ చిత్రంలో బాలకృష్ణను ఇప్పటివరకు చూడని సరికొత్త మాస్ అవతార్‌లో దర్శకుడు చూపించబోతున్నట్లు తెలుస్తోంది. కేవలం యాక్షన్ కే పరిమితం కాకుండా, కథలో బలమైన ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కొరటాల శివ పెద్దపీట వేస్తున్నారట. ఇప్పటివరకు ఆయన తెరకెక్కించిన సినిమాలన్నింటికీ ఒక బలమైన సామాజిక నేపథ్యం లేదా ప్రత్యేకమైన బ్యాక్‌డ్రాప్ ఉండటం విశేషం. ఇప్పుడు ఈ సినిమా కోసం కూడా అదే స్థాయిలో ఒక యూనిక్ బ్యాక్‌డ్రాప్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం నెటిజన్లు మరియు సినీ విశ్లేషకులు ఈ సినిమా కథ ఏ నేపథ్యంతో సాగుతుందనే దానిపై సోషల్ మీడియాలో రకరకాల చర్చలు జరుపుతున్నారు. అంతేకాకుండా, ఈ సినిమాలో ఒక ప్రత్యేకమైన కీలక పాత్ర కోసం కోలీవుడ్ స్టార్ హీరో ఆర్యను సంప్రదించే పనిలో కొరటాల శివ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ఆర్య ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నాడని, ఆయన పాత్ర సినిమాకే ఒక మేజర్ హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. కథా చర్చలు పూర్తి కావడంతో త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. హ్యాట్రిక్ విజయాల జోరుమీదున్న బాలయ్య బాబుతో, మాస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే కొరటాల శివ చేతులు కలపడంతో బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.







## ఓటీటీలోకి 'కొరియన్ కనకరాజు'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే!

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వచ్చిన హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు'. థియేటర్లలో ప్రేక్షకులను కడుపుబ్బా నవించిన ఈ సినిమా, ఇప్పుడు డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో సెప్టెంబర్ 4, 2026 నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్ కాబోతున్నట్లు తెలుస్తుంది. తెలుగుతో పాటు ఇతర ప్రధాన భాషల్లోనూ ఇది అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రాబోతుంది. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, సత్య కామెడీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తమన్ సంగీతం అందించిన ఈ సినిమాను ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, యువి క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించాయి. థియేటర్లలో అలరించిన ఈ మూవీ ఓటీటీలో ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన కనకరాజు (వరుణ్ తేజ్) చెక్కభజన ప్రదర్శనలు చేస్తూ సరదాగా గడిపేస్తుంటాడు. కియా ఫ్యాక్టరీలో పనిచేసే చైత్ర (రితికా నాయక్)ను ప్రేమిస్తాడు. ఇదే సమయంలో కొరియా నుంచి వచ్చిన ఓ గ్యాంగ్‌స్టర్ ఆత్మ కనకరాజు శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఆ ఆత్మ ఎవరిది? దాని లక్ష్యం ఏమిటి? దాని నుంచి బయటపడేందుకు కనకరాజు ఎందుకు కొరియా వెళ్లాల్సి వచ్చింది? అనేదే మిగతా కథ.

## మైత్రీ మూవీ మేకర్స్ తొలి హారర్ మూవీ '418'.. రిలీజ్ ఎప్పుడో తెలియక ఫ్యాన్స్‌లో పెరుగుతున్న ఆసక్తి!




మైత్రీ మూవీ మేకర్స్ ప్రస్తుతం వరుస విజయాలతో టాలీవుడ్‌లో జోరు మీద ఉంది. తాజాగా 'ఇరుముడి'తో భారీ బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ను అందుకున్న ఈ నిర్మాణ సంస్థ.. మరోవైపు విభిన్న కథాంశాలతో తెరకెక్కుతున్న పలు క్రేజీ ప్రాజెక్టులపై దృష్టి సారిస్తోంది. అయితే ఈ బ్యానర్ నుంచి రాబోతున్న తొలి హారర్ థ్రిల్లర్ '418' మాత్రం ఇంకా రిలీజ్ డేట్ కోసం ఎదురుచూస్తోంది. ఇప్పటికే సినిమా విడుదలకు సిద్ధంగా ఉన్నప్పటికీ.. కొత్త విడుదల తేదీపై మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది. '418' చిత్రానికి కీర్తన్ నాగగౌడ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రశాంత్ నీల్ ఈ ప్రాజెక్ట్‌కు బ్యాకింగ్ అందిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో ప్రీతి పగడాల కథానాయికగా నటిస్తున్నారు. నిజానికి ఈ చిత్రాన్ని 2026 జూలై 31న థియేటర్లలో విడుదల చేయాలని మేకర్స్ మొదట నిర్ణయించారు. అయితే విడుదలకు కొద్ది రోజుల ముందు అనూహ్యంగా సినిమాను వాయిదా వేశారు. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని చిత్ర బృందం అప్పట్లో వెల్లడించింది.అయితే జూలై చివరిలో రిలీజ్ వాయిదా పడినప్పటి నుంచి దాదాపు నెల రోజులు గడిచినా.. ఇప్పటివరకు కొత్త రిలీజ్ డేట్‌ను మాత్రం అధికారికంగా ప్రకటించలేదు. దీంతో అసలు '418' సినిమా ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే ప్రశ్న ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మైత్రీ మూవీ మేకర్స్ పేరు టాలీవుడ్‌లో భారీ కమర్షియల్ సినిమాలతో పాటు విభిన్న కథలను తెరకెక్కించే నిర్మాణ సంస్థగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఈ నేపథ్యంలో ఆ బ్యానర్ నుంచి వస్తున్న తొలి హారర్ థ్రిల్లర్ కావడంతో '418'పై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది.ఇప్పటివరకు సినిమాకు సంబంధించిన కథ, పాత్రలు, కీలకమైన అంశాలను మేకర్స్ పెద్దగా బయటకు వెల్లడించలేదు. దీంతో సినిమా కాన్సెప్ట్ ఏంటి? ఇందులో ఎలాంటి హారర్ ఎలిమెంట్స్ ఉండబోతున్నాయి? అనే విషయాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి కొనసాగుతోంది. ప్రశాంత్ నీల్ పేరు ఈ ప్రాజెక్ట్‌తో అనుసంధానం కావడం కూడా సినిమాపై అంచనాలు పెరగడానికి మరో కారణంగా మారింది. కీర్తన్ నాగగౌడ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందించబోతోందనేది తెలియాలంటే మరికొంత సమయం వేచి చూడాల్సిందే.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,